## మహిళ దారుణ హత్య ..!

**తాండూరు, సెప్టెంబరు 21, ప్రభాతవార్త** : వికారాబాద్ జిల్లా తాండూరులో పట్ట పగలే దారుణం చోటు చేసుకుంది. ఓ వ్యక్తి కత్తితో మహిళపై దాడి చేసి హత్య చేశారు. ఈ సంఘటన పట్టణంలో కలకలం రేపింది. ఇందకు సంబందించి.. తాండూరు పట్టణం వాల్మీకి నగర్ ప్రాంతానికి చెందిన పిచ్చకుంట్ల పద్మమ్మ (50), రాజు దంపతులు. వీరికి ఇద్దరు కుమారులు, ఓ కూతురు ఉన్నారు. స్థానికంగా పందులను మేపుతూ జీవనం సాగిస్తున్నారు. అయితే, ఆదివారం పద్మమ్మ పట్టణంలోని చించోళి రోడ్డు మార్గంలోని మల్లప్ప మడిగ సమీపంలో రోడ్డు పక్కన పంది మాంసం విక్రయించేందకు వచ్చింది. మద్యాహ్నాం ఓ వ్యక్తి పద్మమ్మ వద్దకు వచ్చి అక్కడే ఉన్న కత్తితో ఆమెపై దాడి చేసి పరారయ్యాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. రక్తపు మడుగులో ఉన్న పద్మమ్మను స్థానికుల సహాయంతో ఆటోలో చికిత్స నిమిత్తం పట్టణంలోని ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మరోవైపు పద్మమ్మపై దారుణానికి పాల్పడిన వ్యక్తి ఆమెకు అల్లుడు అవుతాడని స్థానికులు తెలిపారు. పాత కక్ష్యలతోనే హత్యకు పాల్పడినట్లు తెలిసింది. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు కొనసాగిస్తున్నారు.




రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్

వార్త


## అనాథాశ్రమ సందర్శనపై నివేదిక

**శంకర్‌పల్లి, సెప్టెంబర్ 21, ప్రభాతవార్త:** హ్యాపీ క్లబ్ తోపాటు ఇతర సమూహాల నుండి వాలంటీర్లతో పాటు క్లబ్ ఐనా సభ్యులు కృషి ఫౌండేషన్ ఆర్ఫనేజ్ను ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా 20 మంది ఇతర సహకార సమూహాల నుండి 15 మంది సహా మొత్తం 35 మంది సభ్యులు ఈ పర్యటనలో పాల్గొన్నారు. సమాజ సేవ, పిల్లలలో ఆనందాన్ని పెంపొందించడంలో మా నిరంతర నిబద్ధతలో భాగంగా ఈ సందర్శన ప్రణాళిక చేయబడింది. మంచును విచ్ఛిన్నం చేయడానికి పరిచయాలు మరియు ఆటల శ్రేణితో రోజు ప్రారంభమైంది. పిల్లలు బాస్కెట్బాల్, ఫుట్బాల్ మరియు క్రికెట్ వంటి కార్యకలాపాలలో చురుకుగా పాల్గొని, శక్తి ఉత్సాహంతో పాల్గొన్నారు. ఈ ఆటలు సంతోషకరమైన వాతావరణాన్ని సృష్టించడమే కాకుండా స్వచ్ఛంద సేవకులు పిల్లలతో మరింత సన్నిహితంగా కనెక్ట్ అవ్వడానికి కూడా సహాయపడ్డాయి. ఆటల తరువాత, అనధికారిక సంభాషణలు పిల్లల రోజువారీ జీవితాలు, ఆకాంక్షలు మరియు అనుభవాలను బాగా అర్థం చేసుకోవడానికి జట్టుకు వీలు కల్పించాయి. బదులుగా, పిల్లలు సందర్శకులతో ఉత్సాహంగా నిమగ్నమయ్యారు మరియు క్యాంపస్ పర్యటనకు కూడా వారిని నడిపించారు, గర్వంగా వారి పరిసరాలను మరియు విజయాలను ప్రదర్శించారు.

# శంషాబాద్ టూ వికారాబాద్..

### రేడియల్ రోడ్డుపై రైతన్నల అభ్యంతరం, ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా జేఏసీ ! పరిగి వద్ద రౌండ్ టేబుల్ సమావేశం త్రిపులార్ అలైన్‌మెంట్ మార్పుపై ఆందోళనలు







రేడియల్ రోడ్డుకు వ్యతిరేకంగా రైతుల సమావేశం



తిపులార్‌కు వ్యతిరేకంగా ఎంపీకి వినతిపత్రం అందజేసిన రైతులు.

**ప్రభాతవార్త, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :** హైదరాబాద్ రీజినల్ రింగ్ రోడ్డు, ప్రస్తుతం మార్కింగ్‌కు సిద్ధంగా ఉన్న రేడియల్ రోడ్డుకు వ్యతిరేకంగా ఉమ్మడి రంగారెడ్డి జిల్లా రైతుల నుంచి నిరసనలువ్యక్తమవుతున్నాయి. గతంలో రూపొందించిన త్రిపులార్ అలైన్‌మెంట్ ప్రకారం కాకుండా కొత్త ప్రణాళికలను రూపొందించడం పట్ల రైతులు మండిపడుతున్నారు. ఆరు లేన్ల త్రిపులార్‌ను 340 కిలోమీటర్ల పొడవు చేపట్టాలని, వివిధ జాతీయ రహదారులను అనుసంధానం చేస్తూ రోడ్డు నిర్మించేందుకు స్కెచ్ వేశారు. ఉత్తర, దక్షిణ విభాగాలుగా విభజించి త్రిపులార్ నిర్మాణం చేపట్టనున్నారు. దక్షిణ విభాగంలో వికారాబాద్ జిల్లాలోని పూడూరు, పరిగి, నవాబ్‌పేట, మోమిన్‌పేట మండలాలలో భూములు కోల్పోతున్న రైతుల నుంచి తీవ్ర వ్యతిరేకత నెలకొంది. ఈ ప్రాంతంలో ఎకరా కోటి రూపాయలకు పైగానే ధరలు పలుకుతున్నాయి. చాలామంది చిన్న, సన్నకారు రైతులకు ఎకరా నుంచి మూడెకరాల భూములే ఉన్నాయి. ఇవే భూములపై వారు వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. త్రిపులార్ కొత్త అలైన్‌మెంట్ వల్ల తమకు తీరని అన్యాయం జరుగుతుందంటూ చాపకింద నీరులా ఆందోళన చేపట్టిన రైతులు ప్రస్తుతం రోడ్లెక్కి నిరసన వ్యక్తం చేస్తున్నారు. త్రిపులార్‌కు తోడుగా ఇటీవల శంషాబాద్ నుంచి వికారాబాద్ జిల్లా వరకు రేడియల్ రోడ్డు నిర్మాణం చేపట్టాలనే ప్రతిపాదన తెరపైకి వచ్చింది. శంషాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు ఎగ్జిట్ 17 నుంచి హుడా కాలనీ అండర్‌పాస్ మీదుగా పరిగి వరకు 55 కిలో మీటర్ల రేడియల్ రోడ్డు ప్రతి పాదించారు. ఈ రోడ్డు నిర్మాణంలో నాలుగు మండ లాలు, 24 గ్రామాలకు అను సంధానం చేయ నున్నారు. త్వరలో డీపీఆర్, టెండర్లు పూర్తి చేసేందుకు కసరత్తులు చేస్తున్నారు. మార్కింగ్ పనులు కూడా ప్రారంభించినట్లు తెలుసుకున్న రైతులు ఆందోళన చెందుతున్నారు. త్రిపులార్‌లో ఆరు లేన్ల రోడ్డు వేస్తే తాము తీవ్రంగా నష్టపోతామని ఆందోళన వ్యక్తం చేస్తూ చేవెళ్ల ఎంపీ విశ్వేశ్వరరెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్యకు రైతులు వినతిపత్రాలను సమర్పించారు. సరిగ్గా ఇదే సమయంలో పిడుగులాంటి వార్త విన్న రైతులు రేడియల్ రోడ్డు పట్ల తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. రేడియల్ రోడ్డును శంషాబాద్, షాబాద్, కొత్వాల్‌గూడ, అమ్మపల్లి, నర్సుడా, సుల్తాన్‌పల్లికాచారం, రామయ్య గూడ, మల్కారం, రామాంజాపూర్, సోలిపేట, హైతాబాద్, పెద్వేడు, దామర్లపల్లి, మాచన్‌పల్లి, నాగర్‌కుంట, బోన్‌గిరిపల్లి, షాబాద్, కొమరబండ, ఉబ్బగుంట, బొబ్బిలిగాం, వికారాబాద్ జిల్లా పరిధిలోని పరిగి, పూడూరు, కంకల్, మాచన్‌పల్లి, మాదారం, రాకంచర్ల, తదితర గ్రామాల గుండా నిర్మించనున్నారని తెలుస్తున్నది. 55 కిలోమీటర్ల పొడవునా వేసే రేడియల్ కోసం పెద్ద ఎత్తున భూములు సేకరిస్తారని తెలుసుకున్న రైతుల నుంచి పెద్ద ఎత్తున నిరసన వ్యక్తమవుతోంది. తమకు రేడియల్ రోడ్డు అవసరం లేదని స్పష్టం చేస్తున్నారు. రెండు రోజుల క్రితం పరిగి మండలం మాదారం రైతు వేదిక వద్ద సమావేశమైనారు. జేఏసీగా ఏర్పడి భవిష్యత్ ఉద్యమ కార్యాచరణ రూపొందించాలని నడుం బిగించారు. రోడ్ల నిర్మాణం పేరుతో పేద రైతుల భూములకు ఎసర పెట్టొందని అంటున్నారు. ప్రస్తుతం శంషాబాద్ నుంచి పరిగి వరకు ఉన్న పాత రోడ్డునే విస్తరించి అభివృద్ధి చేయాలని డిమాండ్ చేస్తున్నారు. రేడియల్ రోడ్డు నిర్మాణం వల్ల బీసీ, దళిత, మైనార్టీలకు చెందిన సన్నకారు రైతులకే అన్యాయం జరుగుతుందని వాపోతున్నారు. తమకు ఎకరా, రెండు ఎకరాలకు మించిలేదని, ఈభూములపైనే ఆధారపడి జీవిస్తున్నా మని అంటున్నారు. ప్రభుత్వం రేడియల్ నిర్మాణం నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

## భూములు కోల్పోతున్న రైతులకు నష్టపరిహారంతోపాటు భూమి కేటాయించాలి

**రాష్ట్ర మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్**

**తలకొండపల్లి, సెప్టెంబర్21, ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేస్తున్న రీజినల్ రింగ్ రోడ్డు కోసం ఆయా గ్రామాల్లోని రైతులు తమ భూములను కోల్పోవలసి ఉందని వారందరికీ మార్కెట్ ధర ప్రకారం నష్టపరిహారం చెల్లించి భూములు కోల్పోయిన రైతులకు మరోచోటనైన భూములు కేటాయించాలని రాష్ట్ర మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్, తలకొండపల్లి మాజీ జెడ్పిటిసి ఉప్పల వెంకటేష్ అన్నారు. శనివారం నాడు రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండల పరిధిలోని జంగారెడ్డి పల్లి గ్రామంలో రీజినల్ రింగ్ రోడ్డు కు భూములు కోల్పోతున్న రైతులతో సమావేశం నిర్వహించారు. ఆయా రైతుల భూముల వద్దకు వెళ్లి రైతులకు మనోధైర్యం కల్పించారు. సందర్భంగా రైతులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎవరి మేలు కోసం రీజనల్ రింగ్ రోడ్డు అలైన్మెంట్ పనులు మార్చివేశారని, గతంలో ఒక విధంగా మళ్లీ మరొక మూడుసార్లు రీజనల్ రింగ్ రోడ్డు పరిధిని మారుస్తూ ఎవరికో కొంతమందికి లబ్ధికుర్చేందుకు రీజినల్ రింగ్ రోడ్డు అలైన్మెంట్ పనులు మార్చి వేస్తున్నారని ఆయన విమర్శించారు. అభివృద్ధి పేరుతో చిన్న సన్నకారు రైతుల నుంచి భూములను లాక్కోవడం ఇంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. నిరుపేదలకు ఉన్నటువంటి ఎకరం అర ఎకరం పొలములలో వృద్ధి పేరుతో భూములు లాక్కోవడం సమంజసం కాదని, అయిన వారందరికీ మార్కెట్ ధర కంటే ఎక్కువనే నష్టపరిహారం చెల్లించి భూములు కోల్పోతున్న రైతులను ఆదుకోవాలని అన్నారు. రంగారెడ్డి జిల్లాలో మిగిలి ఉన్న వందలాది ఎకరాల ప్రభుత్వ భూముల్లో భూములు కోల్పోతున్న రైతులకు పంపిణీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రైతుల కు మద్దతుగా తన వంతు పూర్తి సహాయ సహకారాలు అందించనున్నానని సందర్భంగా వారికి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తలకొండపల్లి మాజీ ఎంపీపీ తిరుమని నిర్మల శ్రీశైలం గౌడ్, సర్పంచ్ల సంఘం మాజీ మండల అధ్యక్షులు గోపాల్ నాయక్, మాజీ సర్పంచ్ లు పెరుమాల లలిత జోతయ్య,, లక్ష్మణ్ నాయక్ తో పాటు ఆయా గ్రామాల రైతులు తదితరులున్నారు.



## శంకర్ పల్లిలో నవరాత్రి ఉత్సవాల ఏర్పాట్లు పూర్తి



**శంకర్‌పల్లి, సెప్టెంబర్ 21, ప్రభాతవార్త :** శంకర్ పల్లి పట్టణ కేంద్రంలో విజయదశమి నవరాత్రి ఉత్సవాలను పునస్కరించుకొని జై భవాని యూత్ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా ఏర్పాట్లు ప్రారంభించారు. శంకర్పల్లి చౌరస్తా నుండి విఠలేశ్వర ఆలయం వరకు ముస్తాబులు చేస్తున్నారు. గత 24 సంవత్సరాల నుండి శంకర్పల్లి పట్టణంలో దసరా ఉత్సవాలను జై భవాని యూత్ వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈసారి 25వ సంవత్సరం కావడంతో దసరా నవరాత్రి ఉత్సవాలను మరింత ఘనంగా నిర్వహిస్తున్నామని జై భవాని యూత్ కమిటీ సభ్యులు తెలిపారు. పట్టణంలోని విఠలేశ్వర ఆలయంలో ఇప్పటికే వేడుకలకు పనులు ప్రారంభించారు. స్థానిక చౌరస్తా నుండి విఠలేశ్వర ఆలయం వరకు వైభవంగా వేడుకలకు ముస్తాబులు చేస్తున్నారు. సోమవారంనుండి జైభవాని యూత్ ఆధ్వర్యంలో భవానీ దీక్షలతో పూజా కార్యక్రమాలు ప్రారంభమై, ప్రతిరోజు విఠలేశ్వర ఆలయంలో భవాని అమ్మవారికి ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహిస్తారు. ఈ సందర్భంగా భవాని యూత్ సభ్యులు మాట్లాడుతూ ఈసారి తాము 25వ నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నామని, పట్టణంలోని ప్రతి ఒక్కరు నవరాత్రి ఉత్సవాలలో పాల్గొని, అమ్మవారి పొందాలని తెలిపారు. , ఈసారి కూడా తమ యూత్ ఆధ్వర్యంలోనవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జై భవాని యూత్ సభ్యులు దండు సంతోష్, ప్రవీణ్ కుమార్, పాండురంగారెడ్డి, సంతోష్ కుమార్, కిరణ్, రఘువీర్, త్రిశూల్, నరేష్ కుమార్, నందకిషోర్, మిరియాల సంతోష్, కిరణ్, గౌతమ్, శ్యాం కుమార్, దిలీప్, ప్రశాంత్, సోను, సంతోష్, దేవేందర్, బన్నీ, మిట్టు పాల్గొన్నారు.

## తేనెటీగల దాడిలో విద్యుత్ ఆపరేటర్ మృతి

**నందిగామ, ఆగస్టు 21, ప్రభాతవార్త, నందిగామ** : విద్యుత్ సబ్ స్టేషన్‌లో ఆపరేటర్‌గా పనిచేస్తున్న షామీం(50) ఆదివారం ఉదయం తేనెటీగల దాడిలో మృతి చెందినట్లు విశ్వసనీయ సమాచారం ద్వార తెలిసింది. చౌదరిగూడ మండలం పెద్ద ఎలికిచర్ల గ్రామానికి చెందిన షమీం గత కొన్ని ఏళ్ల నుండి నందిగామ మండలంలోని విద్యుత్ సబ్ కార్యాలయంలో ఆపరేటర్గా విధులు నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నారు. ఆదివారం ఉదయం తమ గ్రామంలో ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా తేనెటీగల గుంపు ఒక్కసారిగా దాడి చేయడంతో మృత్యు జారుకున్నారు. ఈ ఘటనతో నందిగామ విద్యుత్ సబ్స్టేషన్, పెద్ద ఎల కిచర్లలో తీవ్ర విషాదం నెలకొంది. మృతి చెందిన షమీం ను ప్రభుత్వం మానవత దృక్పథంతో ఆదుకోవాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు .

## వరంగల్ జాతీయరహదారిపై ట్రాఫిక్ మళ్లింపు

ఘట్‌కేసర్ సెప్టెంబర్21, ప్రభాతవార్త: హైదరాబాద్-భూపాలపట్నం జాతీయ రహదారి (163) అభివృద్ధి పనులు జరుగుతుండటంతో అధికారులు ట్రాఫిక్‌ను మళ్లించారు. ఘట్‌కేసర్ మున్సిపల్ బైపాస్ రహదారి, యంనంపేట్ చౌరస్తాలో ఎన్‌హెచ్ఏఐ అధికారులు వంతెన, సర్వీస్‌రోడ్డు పనులు చేపట్టడంతో చౌరస్తాను మూసివేశారు. అంకుశాపూర్ హెచ్‌పిసిఎల్ వద్ద అండర్‌పాస్ నిర్మాణం చేస్తుండటంతో ఎన్‌హెచ్ఏఐ, రాచకొండ ట్రాఫిక్ అధికారులు బోర్డులు ఏర్పాటు చేసి వాహనాలను మళ్లించారు. హెచ్‌పిఎస్‌సీ వద్ద నుంచి అవుషాపూర్ సర్వీస్‌రోడ్డు మీదుగా హైవే వరకు ట్రాఫిక్‌ను మళ్లించారు. ఘట్‌కేసర్ పట్టణం నుంచి ఉప్పల్ వైపు వెళ్లే వాహనాలను యంనంపేట్ రోడ్డు మీదుగా ఓఆర్ఆర్ సర్వీస్‌రోడ్డు ద్వారా అన్నోజీగూడకు మళ్లిస్తున్నారు. మైసమ్మగుట్ట, ఎన్ఎఫ్‌సీనగర్ నుంచి ఘట్‌కేసర్‌కు వెళ్లే వాహనాలు, ఘణాపూర్ నుంచి ఘట్‌కేసర్, యంనంపేట్ వెళ్లే వాహనాలు డిమార్ట్ ముందు యూ టర్న్ తీసుకొని వెళ్లాలని ఘట్‌కేసర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రవీందర్ తెలిపారు. రహదారి పనులు జరుగుతున్న దృష్ట్యా వాహనదారులు ట్రాఫిక్‌ను గమనించి నెమ్మదిగా ప్రయాణించాలని ఆయన సూచించారు.

# కొడంగల్‌లో తీవ్ర ఉద్రిక్తత.. పోలీసుల పహారా..



దర్గా కూల్చివేతను నిరసిస్తు ర్యాలీ చేపట్టిన ముస్లీం, మైనార్టీ నాయకులు

### కొనసాగుతున్నరోడ్డువిస్తరణపనులు భారీగా మొహరించిన పోలీసులు, అర్థరాత్రిదర్గా స్మశానవాటికల తొలగింపు మైనార్టీలఆందోళనలు, ఎంఐఎం నాయకుల ముందస్తు అరెస్టులు దర్గా ప్రాంతాన్ని సందర్శించిన బహదుర్‌పుర ఎమ్మెల్యే

**కొడంగల్, సెప్టెంబర్ 21ప్రభాతవార్త**

కొడంగల్ నియోజకవర్గ కేంద్రంలో తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్నాయి. కొడంగల్ పట్టణ అభివృద్ధిలో భాగంగా మున్సిపల్, పోలీసు అధికారుల మద్య నెలరోజుల నుంచి రోడ్డు విస్తరణ పనులు కొనసాగుతున్నాయి. రోడ్డుకు ఇరువైపులా ఉన్న షాపులను తొలగించి, ఇళ్ళను కూల్చివేస్తున్నారు. అందులో భాగంగా శనివారం అర్థరాత్రి సమయంలో మున్సిపల్ కార్యాలయం ఎదురుగా ఉన్న పురాతన దర్గా(మహిబుబ్‌సుభాని)నువినేఆయక కూడలిలో ఉన్న కొంత మంది ముస్లీంల స్మశాన వాటికలను మున్సిపల్ అధికారులు పోలీసుల భారా భద్రత నడుమ కూల్చివేశారు. శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా కొడంగల్ పట్టణంలోని ప్రధాన కూడళ్ళలో భారీగా పోలీసు బలగాలు మెహరించాయి. కూల్చివేతల విషయం తెలుసుకున్న ఎంఐఎం నాయకులు అర్ధరాత్రి సమయంలో ఆందోళనకు సిద్దమవుతున్న క్రమంలో పోలీసులు ముందస్తు చర్యల్లో భాగంగా ఎంఐఎం తాలూకా అద్యక్షులు ఎస్కే. గుల్షన్‌తో పాటు పలువురు ఎంఐఎం నాయకులను అదుపులోకి తీసుకొని రహస్య ప్రదేశానికి తరలించారు. కాగా దర్గాతో పాటు స్మశానవాటికల కూల్చివేతలను నిరసిస్తూ ముస్లీం, మైనార్టీ సంఘాలు ఎస్ఎం. గౌసన్, నవాజ్‌ల అద్వర్యంలో ఆదివారం వినాయక చౌరస్తా నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు ప్రభుత్వానికి, సీఎంకు వ్యతిరేకంగా నినాదాలతో పెద ఎత్తున ర్యాలీ చేపట్టారు. అనంతరం అక్కడే ఏర్పాటు చేసిన నిరసన కార్యక్రమంలో పలువురు మైనార్టీ నాయకులు మాట్లాడుతూ అభివృద్ధి పేరుతో మైనార్టీల మనోభావాలను దెబ్బతీస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. అభివృద్ధి పేరిట కొడంగల్‌లో పేద ప్రజల ఇళ్ళను, మా దార్గాలను తొలగిస్తే చూస్తు ఊరుకునేది లేదన్నారు. కొడంగల్‌లో అభివృద్ధి పనులకు తాము వ్యతిరేకం కాదని, కానీ మేమే దైవంగా భావించే దర్గాలను సమాధులను అర్ధరాత్రి పోలీసు బలగాలను పెట్టి కూల్చివేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. అంబేద్కర్ కూడలిలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం ధర్నా చేస్తున్న ముస్లీం నాయకులను అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

**దర్గా ప్రాంతాన్ని సందర్శించిన బహదూర్‌పుర ఎమ్మెల్యే:**

కొడంగల్ పట్టణంలో రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా ప్రధాన రహదారి పక్కనే ఉన్న మైబుసుభాని దర్గాను మున్సిపల్ అధికారులు పోలీసు బందోబస్తు మద్య తొలగించిన నేపథ్యంలో ఉద్రిక్తత నేపథ్యంలో విషయం తెలుసుకున్న బహదూర్‌పుర ఎంఐఎం పార్టీ ఎమ్మెల్యే ముబీన్‌కాన్ కొడంగల్‌కు చేరుకొని ఎంఐఎం నాయకులతో కలిసి అధికారులు కూల్చివేసిన దర్గా ప్రాంతాన్ని పరిశీలించారు. అలాగే బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర మైనార్టీ నాయకులు, తాండూర్ ఎంఐఎం పార్టీ నాయకులు హాజీ తదితరులు దర్గా ప్రాంతానికి చేరుకొని సంఘటనపై ఆరా తీశారు. శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలుగకుండా పరిగి డీఎస్పీ శ్రీనివాస్‌అద్వర్యంలో ప్రత్యేక పోలీసు బలగాలను మోహరించారు.



అంబేద్కర్ చౌరస్తాలో ధర్నాలో మాట్లాడుతున్న మైనార్టీ నాయకులు

### మేడ్చల్ నుంచి
## శిల్పారామానికి తరలివెళ్లిన మహిళా సంఘాలు

### ఐదు మండలాల నుంచి వెళ్లిన వైనం

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబరు 21, ప్రభాతవార్త**

స్వయం సహాయక సంఘాల ఉత్పత్తుల ప్రదర్శనకు మేడ్చల్ జిల్లా నుంచి మహిళా సంఘాల ప్రతినిధులు బస్సులో బయలు దేరారు. ఆదివారం మేడ్చల్ జిల్లాలోని ఐదు మండలాల నుంచి మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొనటానికి జిల్లా నుంచి నగరంలోని ఇందిరా మహిళా శక్తి బజార్, శిల్పారామంకు బస్సుల్లో తరలివెళ్లారు. జిల్లా గ్రామీణాభివృద్ది సంస్థ-మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బస్సులను మేడ్చల్ జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు అజయ్‌లక్ష్మి బస్సులకు జెండా ఊపి ప్రారంభించారు. మేడ్చల్, శామీర్‌పేట, మూడుచింతలపల్లి, కీసర, ఘట్‌కేసర్ మండలాలకు చెందిన స్వయం సహాయక సంఘాల మహిళా ప్రతినిధులు తరలివెళ్లారు.

అయితేస్వయంసహాయక సంఘాల- ఉత్పత్తుల-ప్రదర్శన కార్యక్రమం నగరంలోని శిల్పారామంలో ఈ నెల 19నుంచి 29వ తేదీ వరకు నిర్వహిస్తుండటంతో మేడ్చల్ జిల్లా నుంచి ఆదివారం మహిళా సంఘాల వారు తరలివెళ్లారు. దీనిలో జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు అజయ్‌లక్ష్మితో పాటు ఐదు మండలాల మహిళా సమాఖ్యల వారు, సంఘాల ప్రతినిధులు, డిఆర్‌డిఏ డిపిఎం ఆనంద్, సిసిలు నాగశ్రీ, భవాని, మహిళాసంఘాలవారు పాల్గొన్నారు.



మేడ్చల్ జిల్లా నుంచి స్వయం సహాయక సంఘాల ఉత్పత్తుల ప్రదర్శనకు వెళ్లిన మహిళా సంఘాల ప్రతినిధులు, జెండా ఊపి ప్రారంభించిన జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు అజయ్‌లక్ష్మి దృశ్యం

## ఇచ్చిన మాట ప్రకారం పెంచన్లను పెంచాలి

**ఎమ్మార్పీఎస్‌రంగారెడ్డిజిల్లాఇన్చార్జి మాసాయిపేట యాదగిరి మాదిగ**

**శంకర్‌పల్లి, సెప్టెంబర్ 21, ప్రభాతవార్త :**

ఎన్నికల సమయంలో పెంచు ఇచ్చిన మాట ప్రకారం తక్షణమే పెంచన్లను పెంచాలని లేనిపక్షంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో తాడోపేడో తేల్చుకుంటామని అన్నారు. ఎమ్మార్పీఎస్ శంకర్ పల్లి మండల అధ్యక్షులు బండ్లగూడ శ్రీనివాస్ మాదిగ మాదిగ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిలుగా ఎమ్మార్పీఎస్ రంగారెడ్డి జిల్లా ఇంచార్జ్ మాసాయిపేట యాదగిరి మాదిగ, జిల్లా ఉపాధ్యక్షులు కాడిగల్ల ప్రవీణ్ మాదిగ, పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్, వీహెచ్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న గ్రామ పంచాయతీల ముట్టడి సందర్భంగా శంకర్ పల్లి మండలం మోకిల, దొంతాన్ పల్లి గ్రామంలో పంచాయతీ జన్వాడ వార్డు కార్యాలయల వద్ద ధర్నా నిర్వహించారు.

అనంతరం గ్రామ పంచాయతీ అధికారికి మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగావారు మాట్లాడుతూ వృద్దులు వికలాంగులు వితంతువులు ఒంటరి మహిళలు వ చేయూత పించను దారులకు పెంచన్లను పెంచుతామని ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. వృద్దులు, వితంతువులు, ఒంటరి మహిళలు మరియు చేయూత పించను దారులకు నాలుగు వేలకు, వికలాంగులకు ఆరువేల రూపాయలకు పెంచాల్సిందేనన్నారు .ముఖ్యమంత్రిచిత్తశుద్ధితోతన మాట నిలబెట్టుకోవా లన్నారు.

# పంచ పరివర్తనతో సమాజ పరివర్తన

## రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ హరిబాబు

**బేగంపేట సెప్టెంబరు 21, ప్రభాతవార్త :** పంచ పరివర్తనతో సమాజ పరివర్తన జరుగుతుందని హరిబాబు అన్నారు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ విజయదశమి ఉత్సవం బేగంపేట శ్యాంలాల్ బిల్డింగ్‌లో జరిగింది. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ప్రారంభించి 100సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఈ ఉత్సవాన్ని నిర్వహించారు. ఈ ఉత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న హరిబాబు మాట్లాడుతూ రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ సమాజంలో పరివర్తన అనే మంత్రంతో ముందుకు వెళుతుందన్నారు. సమాజంలో కుటుంబ ప్రభోదన్, సామరస్యత, పర్యావరణము, స్వదేశీ, పౌరవిధులు ఇలా ఐదు రకాలైన పరివర్తన వస్తే బాగుంటుందన్నారు. సికింద్రాబాద్ జిల్లా బౌద్దిక్ ప్రముఖ్, నగర సంఘచాలకులు నాగరాజు మాట్లాడుతూ ఈ ఉత్సవంలో 100మంది స్వయం సేవక్‌లు పాల్గొన్నారని తెలియజేసారు. డాక్టర్ కేశవరావు బలిరాం పంత్ హెడ్గేవార్ 1925లో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్‌ని స్థాపించారన్నారు. ఆనాటి నుంచి ఈ నాటి వరకు 100 సంవత్సరాలు పూర్తి చేసుకుని సమాజంలో సంఘశక్తి కలౌయుగూ అని చెప్పి సమాజం ద్వారానే ఈ దేశం మళ్లీ విశ్వగురు స్థానంలోకి వెళ్తుందని డాక్టర్ కేశవరావు బలిరాం పంత్ హెడ్గేవార్ చెప్పారని గుర్తు చేసారు. ఈ ఉత్సవాలలో పాల్గొన్న పలువురు వక్తలు మాట్లాడుతూ రామాయణ మహాభారతంలో జరిగిన సంఘటనలు విజయదశమి ఉదాహరణలు అన్నారు. వంద సంవత్సరాల్లో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ చేసిన సమాజసేవను గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో రాజేందర్‌తో పాటు పలువురు వక్తలు పాల్గొన్నారు.



రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ విజయదశమి ఉత్సవ దృశ్యం



పుస్తకాలు పంపిణీ చేస్తున్న దత్తాత్రేయ

## యువతకు నైపుణ్య శిక్షణ అవసరం

**అల్వాల్, సెప్టెంబరు 21 ప్రభాతవార్త:** యువతకు అవసరమైన నైపుణ్య శిక్షణా కేంద్రాలు ఏర్పాటు ద్వారా ఉద్యోగ అవకాశాలు మెరుగు పడతాయని హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ పేర్కొన్నారు. ఆదివారం అల్వాల్, టెలికాం కాలనీలోని బిజెపి సీనియర్ నేత, మాజీ మున్సిపల్ వైస్ జగదీష్ నివాసానికి వచ్చిన దత్తాత్రేయ తాను రచించిన ప్రజల కథే నా ఆత్మ కథ పుస్తకాలను పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలకు అందచేశారు. ప్రపంచ ఐదవ ఆర్థిక శక్తిగా ఉన్న దేశం భవిష్యత్తులో మరిన్ని మెలురాళ్ళను దాటుందని ఆయన పేర్కొన్నారు. నాణ్యమైన విద్య, సాంకేతికతలో యువత మరింత నైపుణ్యాన్ని సాధించాల్సిన అసవరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు మాధవ్, క్రిష్ణారెడ్డి, భాస్కర్, దేవేందర్, సజాత తదితరులు పాల్గొన్నారు.

## ఆహార భద్రతా కార్డులు పంపిణీ

**అల్వాల్, సెప్టెంబరు 21 ప్రభాతవార్త:** అల్వాల్ కౌకూర్ వాసులకు ఆదివారం ఆహార భద్రతా కార్డులు పంపిణీ చేయడం జరిగింది. ప్రభుత్వం నూతనంగా కార్డులు మంజూరు చేస్తున్న విషయమే. మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు ఆదేశాలుతో మేరకు కౌకూర్, భరత్‌నగర్ పరిసర ప్రాంతాలకు చెందిన మహిళలు ఆహార భద్రతా కార్డులు కోసం ధరఖాస్తులు చేసుకున్నారు. మొదటి విడతలో బాగంగా పలువురికి కార్డులు మంజూరైన నేపధ్యంలో స్థానిక కాంగ్రెస్ సీనియర్ నేత మల్లిఖార్జున్ కార్డులను పంపిణీ చేశారు.

## హిందుత్వంపై దాడులను ఎదుర్కోవాలి

**అల్వాల్, సెప్టెంబరు 21 ప్రభాతవార్త:** అల్వాల్‌లో ఆదివారం ఆర్ఎస్ఎస్ విజయదశమి ఉత్సవాన్ని నిర్వహించింది. రాష్ట్రీయ స్వయం సేవక్ ఆవిర్బవించి వంద సంవత్సరాలు అవుతున్న నేపధ్యంలో హెచ్ఎంటి కాలనీ గ్రౌండ్‌లో బస్తీ ప్రముఖ్ కలిదిండి శ్రీనివాస్ వర్మ ఆధ్వర్యంలో కార్యక్రమంలో జరిగింది. ఆర్‌సిసి సిమ్మెంట్ పైపులు అధినేత వెంకన్నగారి వెంకట్ రెడ్డి, ప్రముఖ వక్త రుద్రరాజు సుబ్బరాజు ముఖ్య అతిథులుగా పాల్గొనగా సికింద్రాబాద్ జిల్లా ధర్మజాగరణ ప్రముఖులు హాజరయ్యారు. హిందుత్వం పైన జరుగుతున్న దాడులపై అప్రమత్తంగా ఉంటూ సంఘటితంగా ఎదుర్కొవాల్సిన అవసరం ఉందని వక్తలు అభిప్రాయ పడ్డారు. సంఘాన్ని ప్రజలకు మరింత చేరువ చేయాల్సిన బాధ్యత ప్రతి ఆర్ఎస్ఎస్ కార్యకర్తపై ఉందన్నారు. పంచ పరివర్తన అనే మంత్రంతో ముందుకు సాగాలని వారు పిలుపునిచ్చారు.

## సంపూర్ణ ఆరోగ్యానికి మల్టీ డిసిప్లినరీ రీహాబ్ ముఖ్యం

**జూబ్లీహిల్స్, సెప్టెంబరు 21, ప్రభాతవార్త :** బంజారాహిల్స్ రోడ్ నంబరు 10లోని ఫ్లెక్సస్ న్యూరో సెంటర్‌లో 'రిస్టోరింగ్ లైవ్స్-ది పవర్ ఆఫ్ రీ జనరేటివ్ మెడిసిన్ అండ్ రిహాబిలిటేషన్' అంశంపై ఆదివారం నిరంతర వైద్య విద్య(సీఎంఈ) కార్యక్రమాన్ని నిర్వహించారు. నగరంలోని దాదాపు 40 మంది ఫిజియోథెరపిస్టులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా న్యూరాలజిస్ట్ డాక్టర్ నయీమ్ సాధిక్ మాట్లాడుతూ.. వివిధ రుగ్మతల చికిత్సలో రీజనరేటివ్ మెడిసిన్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. అలాగే ఆయా వైద్య విధానంపై ఉన్న అపోహలను ఆయన తొలగించారు. ఫ్లెక్సస్ రీహాబ్ హెడ్ కనిష్కా శర్మ మాట్లాడుతూ ఫిజియో, ఆక్యుపేషనల్, స్పీచ్ థెరపీ విధానాలు ఇప్పుడు రోగులకు ఎంతో స్వాంతన చేకూరుస్తున్నాయన్నారు. ఈ విధానం ఇప్పుడు ఎంతో ప్రాముఖ్యతను సంతరించుకుంటుందని అన్నారు. అలాగే రోగుల సంపూర్ణ ఆరోగ్యానికి మల్టీ డిసిప్లినరీ రీహాబ్ ఎంతో అవసరం అన్నారు. కార్యక్రమంలో వైద్యులు శుభదీప్, సబిత, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.



అన్న ప్రసాద వితరణలో పాల్గొన్న దూద్‌బౌలి ఆర్య వైశ్య సంఘం ప్రతినిధులు

## సంప్రదాయాలను కాపాడుకోవాలి

**చార్మినార్, సెప్టెంబరు 21 ప్రభాతవార్త :** మన దేశ సంస్కృతి, సంప్రదాయాలు చాలా గొప్పవని దూద్‌బౌలి ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు దోరేటి ఆనంద్ గుప్తా అన్నారు. దూద్‌బౌలిలోని వాసవి భవనంలో ఆదివారం జరిగిన అన్న ప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొన్న ఆనంద్ గుప్తా మాట్లాడుతూ అన్న ప్రసాద వితరణం చేయటం వల్లపుణ్యం లభిస్తుందని తెలిపారు. దాదాపు రెండు వందల మంది అన్న ప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొన్నారని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో దూద్‌బౌలి ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు బి.సంతోష్, జె.సీతారాం, కె.లక్ష్మణ్, కె.సత్యం, ఎం.బాలేష్, జి.సుధాకర్, రమేష్, వంశీ, మహిళా మండలి సభ్యులు లోక పావణి, క్రిష్ణవేణి, సునీత, స్వప్న, శీలత, అరుణ, రాణీతో పాటు పలువురు పాల్గొన్నారు.

## రిటర్మెంట్ వయోపరిమితి తగ్గింపుపై నిరసన

**జీడిమెట్ల, సెప్టెంబర్ 21, ప్రభాతవార్త :** జీడిమెట్ల పారిశ్రామిక వాడలో ధర్మో కేబుల్ కంపెనీలు 55 సంవత్స రాలకే రిటర్మెంట్ చేస్తూ కార్మికుల అన్యాయం జరుగుతుందని ఎన్నో సంవత్సరాలుగా పోరాడుతున్న కంపెనీ యాజమాన్యం మాత్రం నిమ్మకు నీరెక్కినట్లు ఏమాత్రం చలనం లేకుండా మొండి వైఖరి ప్రవర్తిస్తుందని యూనియన్ తరపున జాయింట్ కమిషన్ ఆఫ్ లేబర్ శ్యాంసుందర్ రెడ్డికి కంప్లైంట్ చేయగా, జాయింట్ కమిషనర్ ఆఫ్ లేబర్ శ్యాంసుందర్ రెడ్డి సమక్షంలో లేబర్ ఆఫీసులో మీటింగ్ జరిగింది. ఈ మీటింగ్ కంపెనీ హెచ్ఆర్ శ్రీకాంత్ హాజరయ్యారు. అలాగే యూనియన్ మెంబర్స్ ప్రెసిడెంట్ చింతల నాగరాజు, సుందర్ రెడ్డి, ధర్మ కేబుల్ కంపెనీపైన, యాజమాన్యం పైన సీరియస్ అయ్యారు. 58 సంవత్సరాలు రిటైర్మెంట్ ఏజ్ అనేది మాండేటరీ మీరు ఎందుకు మూడు సంవత్సరాలు కార్మికులకు లాస్ చేస్తున్నారని, కంపెనీకి ఇమ్మీడియేట్లీ నోటీసు పంపించడం కూడా జరిగింది. తప్పనిసరిగా 58 సంవత్సరాలు సర్వీస్ చేయవలసినదిగా కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో కంపెనీ హెచ్.ఆర్ శ్రీకాంత్, యూనియన్ ప్రెసిడెంట్ చింతల నాగరాజు, జనరల్ సెక్రటరీ శ్రీకాంత్ రెడ్డి, బాడీ మెంబర్స్ అందరూ పాల్గొన్నారు.

## క్రైస్తవులపై కేసులు ఎత్తివేయాలి

**సైఫాబాద్, సెప్టెంబరు 21 ప్రభాతవార్త:** నారాయణగూడ, సికింద్రాబాద్‌లలోని వైఎంసిఎలకు చెందిన క్రైస్తవ సంస్థల ఆస్తులపై కాంగ్రెస్ పెద్దల కన్నులు పడ్డాయని, తక్షణమే మానుకోవాలని డిమాండ్ చేస్తూ పలువురు క్రైస్తవులు ఆదివారం ట్యాంక్‌బండ్ వద్దగల అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా క్రైస్తవ ధర్మ ప్రచార పరిరక్షణ సమితి అధ్య క్షుడు జెరుసలేము మత్తయ్య మాటాడారు.

## ఉప్పల్‌లో రక్తదాన శిబిరం

**ఉప్పల్, సెప్టెంబరు 21 ప్రభాతవార్త :** దేశ ప్రధాని నరేంద్ర మోడీ జన్మదిన వేడుకలలో భాగంగా ఉప్పల్ డివిజన్ బిజెపి అధ్యక్షులు మార్నెని ఫణీంద్ర ఆధ్వర్యంలో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, ఎమ్మెల్సీ మల్కా కొమరయ్య, బిజెపి మహిళా మోర్చ రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ శిల్పా రెడ్డి ముఖ్య అతిదులుగా విచ్చేసి భారతమాత చిత్రపటానికి పూలు వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా తలసేమియా వ్యాధిగ్రస్తుల చేయూత కోసం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరానికి పలువురు యువకులు వచ్చి రక్తదానం చేశారు. సుమారు 72 మంది యువకులు రక్తదానం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు శామీర్‌పేట ధర్మారెడ్డి, డివిజన్ ప్రధాన కార్యదర్శి తీగ విఠల్ రావు, నామ శ్రవణ్, కోశాధికారి దువ్వల రమేష్, ఉపాధ్యక్షులు భవిష్య ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ నేతల పాదయాత్ర

**సరూర్‌నగర్, సెప్టెంబర్ 21 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గంలోని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ 17వ డివిజన్ బాలాపూర్ సీతా ఎవెన్యూ కాలనీలో ఆదివారం కాంగ్రెస్ నాయకులు పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ చిగిరింత నర్సింహారెడ్డి, స్థానిక మాజీ కార్పొరేటర్ వంగేటి ప్రభాకర్‌రెడ్డిలు కాలనీలో పాదయాత్రలు చేసి మ్యాన్‌హోళ్లు, డ్రైనేజీ, రోడ్ల సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు అధికారుల దృష్టికి తీసుకెళ్ళి సమస్యలను పరిష్కరిస్తామని స్థానికులకు హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ఆగడాలను సహించబోం

**నిజాంపేట్, సెప్టెంబర్ 21, ప్రభాతవార్త :** కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి ప్రగతి నగర్‌లో కుంటుపడిన అభివృద్ధిపై కార్పొరేషన్‌కి చెందిన బిఆర్ఎస్ పార్టీ మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు మీడియా ముఖంగా తమ ఆవేదనను వ్యక్తం చేస్తూనే, కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆగడాలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రగతి నగర్ స్మశాన వాటిక వద్ద ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రగతి నగర్ వ్యవస్థాపకులు అని చెప్పుకునే దయాకర్ రెడ్డి, సుధీర్ రెడ్డిలు తమ సొంత వ్యాపారాల అభివృద్ధి కోసం పార్కు స్థలాలను, ప్రభుత్వ స్థలాలను, స్మశాన వాటికకు కేటాయించిన స్థలాన్ని అమ్ముకుంటే, ప్రస్తుతం ఉన్న స్మశాన వాటిక స్థలాన్ని కాపాడింది స్థానిక బిఆర్ఎస్ నాయకులు ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలే కదా? ప్రగతి నగర్ వాసుల చివరి మజిలీ కష్టాలు తీర్చాలని నేటికి పోరాడుతుంది మా బిఆర్ఎస్ పార్టీ నాయకులు అనేది వాస్తవం కాదా....? ఇంకెందుకు ఈ చిల్లర రాజకీయాలు...? అంటూ ప్రశ్నించారు. సమావేశంలో మాజీ కార్పొరేటర్ బాలాజీ నాయక్, డివిజన్ అధ్యక్షులు స్టాలిన్ రెడ్డి, ఉప్పు జస్వంత్, శ్రీకర్ గుప్తా, నాయకులు యాదగిరి గౌడ్, ఎల్లయ్య, సాంబశివరెడ్డి, నీరుడు యాదగిరి, దండుగుల స్వామి, అజయ్ చౌదరి, ఎండీ.గౌస్ పాషా, లలితా రెడ్డి, కృష్ణ మంజరి, ఉప్పు శిల్పా, అంజలి, కురుమూర్తి, రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మోడీ అభిమానులందరూ మొక్కలను నాటాలి

**చిక్కడపల్లి, సెప్టెంబరు 21 ప్రభాతవార్త:** సేవా పక్వాడ కార్యక్రమంలో భాగంగా ఆదివారం గాంధీనగర్ డివిజన్‌లోని అశోక్‌నగర్‌లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్ లాంఛనంగా ప్రారంభించారు. భారతీయ జనతా పార్టీ దేశవ్యాప్తంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుంది. సెప్టెంబరు 17 నుండి అక్టోబర్ 2 వరకు నిర్వహించే సేవా పక్వాడా లో భాగంగా మొక్కలు నాటిన అనంతరం డాక్టర్ కె.లక్ష్మణ్ మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యమిస్తూ, దేశవ్యాప్తంగా చెట్లు నాటడం ప్రత్యేక కార్యక్రమంగా నిర్వహిస్తున్నామన్నారు. అమ్మ పేరుతో ఒక మొక్క అంటూ మరోసారి దేశవ్యాప్తంగా బీజేపీ శ్రేణులు, మోడీ అభిమానులు మొక్కలను నాటాలని పిలుపునిచ్చారు. దేశాన్ని పచ్చదనంతో తీర్చిదిద్ది ప్రధాని మోడీకి పుట్టిన రోజు కానుకగా అందించాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్ మహంకాళి జిల్లా అధ్యక్షులు జి.భరత్ గౌడ్, సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్ కుమార్, అసెంబ్లీ కన్వీనర్ రమేష్ రామ్, డివిజన్ అధ్యక్షుడు వి.నవీన్ కుమార్, జేపీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

## హత్యకేసు నిందితులకు రిమాండ్

**పేట్ బషీరాబాద్, సెప్టెంబరు 21, ప్రభాతవార్త:** భూవివాదంలో ఓ వ్యక్తిని రాడుతో కొట్టి చంపగా.. మరో వ్యక్తి ఆసుపత్రి పాలైన ఘటనలో ఇద్దరు నిందితులను రిమాండ్‌కు తరలించారు. పేట్ బషీరాబాద్ సీఐ విజయ్‌వర్ధన్ తెలిపిన వివరాల ప్రకారం శ్రీకాకుళం జిల్లాకు చెందిన పడాల ఆనంద్ తన అన్న పడాల సుధాకర్‌లు ఇద్దరు అన్నదమ్ములు. గత కొన్నేండ్ల కిందట నగరానికి వలస వచ్చి దూలపల్లిలోని వెల్డింగ్, ఫ్యాబ్రికేషన్ వ్యాపారంలో స్థిరపడ్డారు. కాగా దూలపల్లి ప్రాంతానికి చెందిన దుర్గం శ్రీకాంత్ గౌడ్ (38) మరో వ్యక్తి మహ్మద్ అలీలు ఇద్దరు కలిసి పడాల ఆనంద్‌కు సంబంధించిన స్థలాన్ని తక్కువ ధరకు అమ్మాలని గత కొంతకాలంగా వేధిస్తున్నారు. ఇదే తరుణంలో ఈ నెల 18న రాత్రి సమయంలో దూలపల్లి సమీపంలోని కంటైనర్ వద్ద శ్రీకాంత్, అలీతో పాటు మరో వ్యక్తి రాజు అనే ముగ్గురు వ్యక్తులు ఆనంద్‌ను తన షెడ్డు వద్ద అడ్డుకొని స్థలానికి సంబంధించిన విషయాన్ని చర్చించి మాటామాటా పెరగడంతో ఇరువురి మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. అంతలోనే ఆనంద్ సోదరుడు అక్కడి చేరుకోవడంతో గొడవ మరింత తీవ్రతరం కాగా ఇద్దరు అన్నదమ్ములు ఆనంద్, సుధాకర్‌లు రాడ్లతో శ్రీకాంత్, అలీలపై విచక్షణా రహితంగా దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో దుర్గం శ్రీకాంత్ గౌడ్ అక్కడికక్కడే మృతి చెందగా అలీకి తీవ్రగాయాలై గాంధీ వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. హత్య కేసుపై పోలీసులు ముమ్మర చర్యలు చేపట్టి నిందితులైన ఆనంద్, సుధాకర్‌లను కోర్టులో హాజరుపర్చగా నిందితులని తేలడంతో ఇద్దరిని రిమాండ్‌కు తరలించారు. హత్యకేసును చేజిక్కించిన పేట్ బషీరాబాద్ పోలీసులను ఉన్నతాధికారులు అభినందించారు.

## ఆటో డ్రైవర్ల అన్నదానం

**బేగంపేట :** బేగంపేట పోలీసులైన్ చౌరస్తాలో మిలాద్ ఉన్ నబీ సందర్భంగా ఆటో డ్రైవర్లు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సనత్‌నగర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి డా.కోట నీలిమ, సనత్ నగర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు విశాల్ సుధామ్‌లు అన్నదాన కార్యక్రమంలో ముఖ్య అతిధులుగా పాల్గొన్నారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ మిలాద్ ఉన్ నబీ సందర్బంగా అన్నదానం నిర్వహించడం ఎంతో అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు మహ్మద్ సలీమ్ ఖాన్, ప్రధాన కార్యదర్శి కట్టి మణి సిద్దప్ప నేతృత్వంలో కాంగ్రెస్ నాయకులు మరియూ స్థానికులు పాల్గొన్నారు.

## మోడీ ఫ్లెక్సీని చించారని ఫిర్యాదు

**సరూర్‌నగర్, సెప్టెంబర్ 21 ప్రభాతవార్త:** హైదరాబాద్ నగర శివార్లలోని బాలాపూర్ శివాజీ చౌక్ ఆర్‌సిఐ రోడ్డులో ఇటీవల జరిగిన ప్రధాని నరేంద్ర మోడి సందర్భంగా ఏర్పాటు చేసిన భారీ ఫ్లెక్సీని గుర్తు తెలియని వ్యక్తులు చింపివేయడంపై బిజెపి నాయకులు స్థానిక బాలాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ప్రధాని ఫ్లెక్సీని చింపివేయడం దారుణమనీ దీనికి బాధ్యులైన వారిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు ఫిర్యాదులో కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో పార్టీ అధ్యక్షుడు రాళ్ళగూడెం రామకృష్ణారెడ్డి, సీనియర్ నాయకులు కొంతం ప్రకాశ్‌రెడ్డి, నవారు శ్రీనివాస్‌రెడ్డి, మంగపతి నాయక్, కిరణ్‌రాజ్, పవన్ పటేల్, చైతన్య తదితరులు ఉన్నారు.

## వాకర్స్ ఇంటర్నేషనల్ ఏరియా వైస్‌ప్రెసిడెంట్‌గా మురళీకృష్ణ

**చిక్కడపల్లి, సెప్టెంబరు 21 ప్రభాతవార్త:** వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్-301 ఏరియా వైస్ ప్రెసిడెంట్‌గా ఎస్.మురళీకృష్ణ ఏకగ్రీవంగా ఆదివారం ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా బాగ్‌లింగంపల్లి సుందరయ్య పార్కులో వాకర్స్‌క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సెంట్రల్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.వి.నిరంజన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన సన్మాన కార్యక్రమంలో పార్కు పూర్వ అధ్యక్షుడు రమేశ్‌రెడ్డి, అంబటి శ్రీనివాస్‌రెడ్డి, బాగ్‌లింగంపల్లి ఎంఐజీ-2 వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు రత్నాకర్‌రెడ్డి, రఘురామ్‌రెడ్డి, స్కైలాబ్‌బాబు, రమేశ్, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు. మురళీకృష్ణ మాట్లాడుతూ వాకర్స్ ఇంటర్నేషనల్ తోడ్పాటును అందించడం ద్వారానే తనకు పదవి దక్కడం సంతోషంగా ఉందన్నారు.

## సమాజసేవలో పాల్గొనాలి

**బేగంపేట సెప్టెంబరు 21 ,ప్రభాతవార్త :** విద్యార్థులు విద్యతో పాటు సమాజసేవలో కూడా పాల్గొనాలంటూ ఉస్మానియా విశ్వ విద్యాలయం సీనియర్ ప్రొఫెసర్ ఏ.కృష్ణయ్య అన్నారు. బేగంపేట ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ యూనిట్ (నాలుగు) రంగారెడ్డి జిల్లా తట్టి అన్నారం గ్రామంలో 7రోజుల పాటు పూర్తి చేసారు. ఈ సందర్భంగా నిర్వహించిన ముగింపు క్యాంపులో ముఖ్య అతిథిగా కృష్ణయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా తట్టి అన్నారం మాజీ కౌన్సిలర్ గీతావేణుగోపాల్‌రెడ్డి మాట్లాడారు. ఎన్ఎస్ఎస్ యూత్ మోటివేటర్ డా.రవితేజ, కుమార్, విద్యాసాగర్, ఎన్ఎస్ఎస్ వాలెంటర్ యూనిట్ రోహిణీమీనా, అర్చన, గాయత్రీలు మాటాడుతూ గ్రామ ప్రజలు, నాయకుల ప్రోత్సాహంతో తాము క్యాంపును సమర్థంగా నిర్వహించామన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు పలు అంశాలపై తాము గ్రామస్థులకు అవగాహన కల్పించడం సంతోషంగా భావిస్తున్నామన్నారు.

## భక్తులకు అన్నప్రసాదం

**గన్‌ఫౌండ్రి, సెప్టెంబర్ 21 ప్రభాతవార్త:** పెద్దల అమావాస్యను పురస్కరించుకుని కోఠిలోని నల్లపోచమ్మ దేవాలయంలో అమ్మవారికి తెలంగాణ భజరంగ్ సేనా అధ్యక్షులు ఎన్.ఆర్.లక్ష్మన్‌రావు గుప్త ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఈకార్యక్రమంలో సేనా ప్రతినిధులు శ్రీకాంత్, హరి, బాలాజీ, లక్ష్మన్, నరేష్, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు. కాగా నగరంలోని గోశాలల్లో గోవులకు తమకు తొచ్చిన విధంగా గడ్డి, పండ్లు, పలహారాలను తినిపించారు. అనేక చోట్ల అన్నదానం చేశారు.

## కొండా లక్ష్మణ్‌కు నివాళి

**బేగంబజార్, సెప్టెంబర్ 21ప్రభాతవార్త:** తెలంగాణ నాన్ గజిటెడ్ హైదరాబాద్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా ఉద్యోగ సంఘాల నాయకులు స్వాతంత్ర సమరయోధులు కొండా లక్ష్మన్‌బాపూజీ వర్ధంతి సందర్భంగా బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈసందర్బంగా టి.ఎన్.జి.ఓ కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.ఎం. ముజీబ్‌హుస్సేన్ మాట్లాడుతూ తెలంగాణ కోసం పదవులను వదులుకుని మలిదశ ఉద్య మానికి మార్గదర్శిగా నిలిచిన రాజకీయ వేత్త, బడుగు బలహీన వర్గాల ప్రయోజనాల కోసం శ్రమించిన సామాజికవేత్త కొండా లక్ష్మన్‌బాపూజీ అన్నారు. ఈకార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు విక్రమ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి కుర్రాడి శ్రీనివాస్, అసోసియేట్ అధ్యక్షులు కె.ఆర్.రాజ్‌కుమార్, మురళీరాజు, కార్యవర్గ సభ్యులుముఖీమ్ ఖురేషి, ఏపిఆర్ఓ మహ్మద్ వహిద్, ముస్తాఫా, వివిధ యూనిట్ల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

## బాలాజీ నగర్ కాలనీ అధ్యక్షునిగా వీరంకి

**మెహిదీపట్నం, సెప్టెంబర్ 21, ప్రభాతవార్త :** బాలాజీ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నికలు ఉత్కంఠ భరితంగా కొనసాగాయి. గత వారం రోజులుగా నువ్వా నేనా అనే రీతిలో వీరంకి వెంకటరావు, వై అనిల్ చారి ప్యానల్ లు పోటీపడి ప్రచారం నిర్వహించారు. ఆదివారం ఉదయం ఎలక్షన్ ఆఫీసర్ రిటైర్డ్ అసిస్టెంట్ రిజిస్టర్ ఎం.డి సలీం, ఎన్నికల ఇన్ చార్జ్ అడికి మల్లికార్జున్ ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించి ఫలితాలను విడుదల చేశారు. ఈ ఎన్నికల్లో అధ్యక్షునిగా వీరంకి వెంకటరావు, ఉపాధ్యక్షుడిగా వి వెంకటరమణ, జనరల్ సెక్రటరీగా సామ సురేందర్ రెడ్డి, జాయింట్ సెక్రటరీగా జి. సంతోష్, ట్రెజరర్‌గా మామిడి వెంకటేశ్వర్లు ఎన్నికైనారు. అనంతరం నూతన అధ్యక్షులు వీరంకి వెంకటరావు మాట్లాడుతూ... బాలాజీ నగర్ కాలనీ అభివృద్ధి కోసం నూతన కమిటీ సభ్యులందరం కాలనీవాసుల అభిప్రాయ మేరకు పనిచేస్తామన్నారు. కాలనీ అభివృద్ధి తమ లక్ష్యమని తెలిపారు. ఎన్నికలు ఒకరోజు మాత్రమే ఉంటాయని, అభివృద్ధి మాత్రం ఎప్పటికీ ఉంటుందన్నారు. కాలనీ అభివృద్ధి లో ప్రతి ఒక్కరు కలిసి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కాలనీ సీనియర్ సభ్యులు ఎస్.రామారెడ్డి, వేణుగోపాల్ శర్మ, ఎం.మాధవరెడ్డి, కిషన్ సింగ్, జి.ఉషా, వి.వెంకటేశ్వరి, జి.కవిత, ఎస్. వసుమతి, భారతి కాలనీవాసులు పాల్గొన్నారు.

## త్యాగధనుడు కొండా

**హైదరాబాద్ సెప్టెంబరు 21 ప్రభాతవార్త :** స్వాతంత్ర సమరయోధులు, తొలితరం తెలంగాణ ఉద్యమ నాయకులు కొండా లక్ష్మణ్ బాపూజీ 13వ వర్ధంతి ఘనంగా జరిగింది. ఆదివారం చిక్కడపల్లిలోని 'బీసీ పొలిటికల్ ఫ్రెంట్" రాష్ట్ర కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బీసీ సమైక్య రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.దుర్గయ్య గౌడ్, బీసీ పొలిటికల్ ఫ్రెంట్ రాష్ట్ర నాయకులు అయిలి వెంకన్నగౌడ్‌లు మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్ర సాధనకై తన మంత్రి పదవిని తృణప్రాయంగా త్యాగం చేసిన మహనీయుడని, తెలంగాణ ఉద్యమానికి మద్దతుగా జలదృశ్యంలో గల తన ఇల్లును కార్యాలయానికి అంకితం ఇచ్చిన ఘనత కొండా లక్ష్మణ్ బాపూజీకే దక్కుతుందని కొనియాడారు. అనునిత్యం ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర కోసం పరితపించిన బహుజన నాయకులు, వారి చిరకాలం స్వప్నం సాకారం రాష్ట్రం ఏర్పాటును చూడకుండా మరణించడం బాధాకరమని అన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ రచయిత సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భైరు శేఖర్, బీసీ ఇంటలెక్షువల్ ఫోరం రాష్ట్ర నాయకుడు అవ్వారు వేణు, కేశంమోని శ్రీనివాస్ గౌడ్, శ్రీరాములు గౌడ్, భిక్షపతి చారి విశ్వకర్మ మన్మయ సంఘం ,హరిప్రసాద్ పద్మశాలి సంఘం ,కె.వి గౌడ్ ఇంటలెక్షువల్ ఫోరం కో ఆర్డినేషనేటర్, సీలం శ్రీనివాస్ మున్నూరు కాపు సంఘం, ఇడం అంజనేయులు, రఘు, జగన్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న దృశ్యం

## సెయింట్ మేరీస్ సెంటెనరీ కాలేజ్ స్నాతకోత్సవం

**హైదరాబాద్, సెప్టెంబరు 21 ప్రభాతవార్త:** సెయింట్ మేరీస్ సెంటెనరీ కాలేజ్ ఆఫ్ మేనేజ్‌మెంట్ తన మొదటి స్నాతకోత్సవ వేడుకను ఘనంగా జరుపుకుంది. సికింద్రా బాద్‌లోని సెయింట్ మేరీస్ ఆడిటోరియంలో జరిగిన ఈ వేడుకలకు హెచ్ఎఇఎస్ ఛైర్మన్, హిస్ ఎమినెన్స్ కార్డినల్ పూల ఆంథోనీ ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థుల నుద్దేశించి మాట్లాడారు. అవకాశాలతో నిండిన ప్రపంచం లోకి అడుగుపెట్టే గ్రాడ్యుయేట్లను ప్రోత్సహించారు. సామర్థ్యం, కరుణ, అంకితభావంతో సమాజాన్ని రూపొందించే పరిశ్రమకు సిద్ధంగా ఉన్న నిపుణులుగా మారడానికి నైపుణ్యాలు, సమగ్రత, సృజనాత్మకతతో మిమ్మల్ని మీరు సన్నద్ధం చేసుకోండని విద్యార్థులకు ఉద్బోధించారు. హెచ్ఎఇఎస్ వైస్‌ఛైర్మన్ యెరువా బాలషోరీ, కార్యదర్శి రెవరెండ్ ఫాదర్ గువ్వల ఆంథోనీ గౌరవ అతిథులుగా హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి డైరెక్టర్, ప్రిన్సిపాల్ రెవరెండ్ ఫాదర్ డాక్టర్ ఆంథోనీ వినయ్ అధ్యక్షత వహించి, విద్యా నైపుణ్యం, సమగ్ర అభివృద్ధికి కళాశాల నిబద్ధతను పునరుద్ఘాటించారు.

## బిజెపి నేతల శ్రమదానం

**సరూర్‌నగర్, సెప్టెంబరు 21 ప్రభాతవార్త:** హైదరాబాద్ నగర శివార్లలోని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి కిందకు వచ్చే సిఎన్‌రెడ్డి కాలనీలో బిజెపి ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రధాని నరేంద్ర మోడి జన్మదిన వారోత్సవాలను పురస్కరించుకొని సేవా పఖ్వాడా కార్యక్రమాల్లో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమానికి హాజరైన రంగారెడ్డి జిల్లా స్థానిక సంస్థల ఎన్నికల బిజెపి కన్వీనర్, మహేశ్వరం నియోజకవర్గ పార్టీ ఇంఛార్జి అందెల శ్రీరాములు యాదవ్ పార్టీ నాయకులు, కాలనీవాసులతో కలిసి శ్రమదానం చేసి పరిసరాలను శుభ్రం చేశారు. కాలనీలో పారిశుధ్య సమస్యల నివారణ కోసం ఆయన తన స్వంత ఖర్చుతో గ్రీన్ మ్యాట్ ప్రహరిని ఏర్పాటు చేయించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ బిజెపి అధ్యక్షుడు రాళ్ళగూడెం రామకృష్ణారెడ్డి, సీనియర్ నాయకులు పోరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, నవారు శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఆర్ఎస్ఎస్ వేడుకలు

**శేరిలింగంపల్లి, సెప్టెంబర్ 21 ప్రభాతవార్త :** రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) ఆవిర్భవి ంచి వందేళ్లు పూర్తయిన సందర్భంగా శేరిలింగంపల్లిలోని ప్రశాంత్‌నగర్ బస్తీలో శత జయంతి వేడుకలను ఘనంగా జరిగాయి. ఆదివారం విజయదశమి ఉత్సవాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సాహితీ విద్యాసంస్థల ఛైర్మన్ డీబీ రావు ముఖ్యఅతిథిగా హాజరవగా, వనవాసి కళ్యాణాశ్రమం ప్రాంత సహ కోశాధికారి తాడేపల్లి హనుమత్ ప్రసాద్ ముఖ్యవ్యక్తగా వ్యవహరించారు. గణ వేషదారి స్వయం సేవకులతో పాటు ఆదర్శ్‌నగర్ కాలనీ వాసులు, మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

## అమ్మవారి అలంకారాలతో ఉపాధ్యాయుల సందడి

**జూబ్లీహిల్స్, సెప్టెంబరు 21, ప్రభాతవార్త :** జూబ్లీహిల్స్ లోని భారతీయ విద్యాభవన్స్ పబ్లిక్ స్కూల్(విద్యాశ్రమం)లో ఉపాధ్యాయురాళ్లు ఆడిపాడారు. దసరా శరన్నరవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని పాఠశాల ఆవరణలో వివిధ సంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఇందులో భాగంగా ఈ సారి వైవిధ్యంగా ఉపాధ్యాయులు దసరా ఉత్సవాల నేపథ్యంలో అమ్మవారి దివ్యఅలంకారాలను అనుకరిస్తూ వేషధారణ వేసున్నారు. నృత్యాలు చేస్తూ, అవతారాల సారాంశాన్ని వివరిస్తూ నృత్య కార్యక్రమాలు నిర్వహించారు. మరోవైపు పండుగ ప్రాశస్త్యాన్ని వివరిస్తూ వేసిన నాటిక ప్రదర్శనల్లోనూ ఉపాధ్యాయురాళ్ల చూపిన నటనా ప్రతిభ ఆహుతులను ఆకట్టుకుంది. మహిషాసుర మర్ధినిగా పరిమళ, దుర్గాదేవిగా రీతుపర్ణ తదితరుల వేషధారణ ఆకట్టుకుంది. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ అరుణ శ్రీ పాల్గొన్నారు.



శరన్నరవరాత్రి వైశిష్ట్యాన్ని ప్రదర్శన ద్వారా చాటుతున్న దృశ్యం



కట్ట మైసమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్ తదితరులు

## ప్రజలంతా సుఖంగా జీవించాలి

**కంటోన్మెంట్, సెప్టెంబర్ 21 ప్రభాతవార్త:** ప్రజలు ఎల్లప్పుడు సుఖసంతోషాలతో జీవించాలని అమ్మవారిని వేడుకున్నట్లు కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ తెలిపారు. ఆదివారం అమావాస్యను పురస్కరించుకొని బోయిన్‌పల్లి, చిన్నతోకట్టలోని కట్ట మైసమ్మ దేవాలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. అమ్మవారిని వేడుకుంటే కోరిన కోర్కెలు నెరవేరుతాయన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే శ్రీగణేష్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపనప్రతాప్, బోయిన్‌పల్లి మార్కెట్ మాజీ ఛైర్మన్ టీ.ఎన్.శ్రీనివాస్, కాంగ్రెస్ నేతలు ముప్పిడి మధుకర్, అరుణ్ యాదవ్, శరత్ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన అతిథులను ఆలయ నిర్వాహకులు జాజుల క్రాంతి, సాయిలులు శాలువకప్పి ఘనంగా సత్కరించారు.



3కే రన్‌లో పాల్గొన్న ఈటెల, బానుక, బి.ఎన్.శ్రీనివాస్ తదితరులు

## సందడిగా 3కే రన్

**కంటోన్మెంట్, సెప్టెంబర్ 21 ప్రభాతవార్త:** ప్రధాని నరేంద్ర మోదీ జన్మదిన ఉత్సవాల్లో భాగంగా బిజెవైఎం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన 3 కే రన్‌కు కంటోన్మెంట్ నియోజకవర్గం నుంచి వందలాది మంది బిజెవైఎం నేతలు తరలివెళ్ళారు. ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి ఎంపీ ఈటెల రాజేందర్, ఎమ్మెల్సీ మల్క కొమురయ్యలతో పాటు బిజెపి రాష్ట్ర నాయకుడు బానుక మల్లికార్జున్, మహం కాలి జిల్లా అధికార ప్రతినిధి బి.ఎన్.శ్రీనివాస్‌తో పాటు కంటోన్మెంట్ నియోజకవర్గానికి చెందిన బిజెపి, బిజెవైఎం నేతలు పాల్గొన్నారు.

## అన్నిదానాల్లోనూ అన్నదానం గొప్పది

**కంటోన్మెంట, సెప్టెంబరు 21 ప్రభాతవార్త:** అన్నిదానాల్లో కన్న అన్నదానం గొప్పదని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ తెలిపారు. అమావాస్యను పురస్కరించుకొని ఆదివారం బోయిన్‌పల్లి బాపూజీ నగర్‌లోని నల్లపోచమ్మ దేవాలయంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో హ్యూమన్ రైట్స్ పౌండేషన్ వ్యవస్థాపకుడు ప్రకాశ్ బాటియా, ఆలయ కమిటీ సభ్యులు ప్రేమ్ ముదిరాజ్, రామారావు, దుర్గయ్య, శ్రీకాంత్, నర్సింహ, మారుతీ గౌడ్, క్రాంతి, సాయి, విఠల్ రావు, శ్రీనివాస్ గౌడ్, రాము, ఈనిష్ తదితరులు పాల్గొన్నారు.

## దేవీ నవరాత్రులను జయప్రదం చేయాలి

**అడ్డగుట్ట, సెప్టెంబర్ 21 ప్రభాతవార్త:** దేవీ నవరాత్రులను పురస్కరించుకొని అడ్డగుట్ట డివిజన్ రియోపాయింట్ వద్ద జై భవాని ప్రెండ్స్ ఆధ్వర్యంలో జరగనున్న వేడుకలకు హాజరు కావాలని కోరుతూ సికింద్రాబాద్ అసెంబ్లీ కంటెస్టెడ్ ఎమ్మెల్యే ఆదం సంతోష్‌కుమార్‌కు ఆహ్వాన పత్రికను అందజేశారు. ఆదంను కలిసిన వారిలో యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు అనంత క్రిష్ణారావు, మేకల నవీన్, సాయి, రాము, ప్రేమ్‌లు పాల్గొన్నారు.



క్రీడా విజేతలతో ఎమ్మెల్యే శ్రీగణేష్ తదితరులు

## యువత క్రీడల్లో రాణించాలి

**కంటోన్మెంట్, సెప్టెంబర్ 21 ప్రభాతవార్త:** యువత క్రీడల్లో రాణించాలని, క్రీడల్లో పాల్గొంటే అరోగ్యంగా ఉంటారని కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్. శ్రీగణేష్ తెలిపారు. 8వ వార్డు బొల్లారంలోని కంటోన్మెంట్ గ్రౌండ్‌లో ఫుట్‌బాల్ క్లబ్ (జిఎఫ్‌సి) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫుట్‌బాల్ టోర్నమెంట్స్‌ను నిర్వహించగా విన్నర్స్ బ్రాలర్స్ టీమ్‌కు ఎమ్మెల్యే శ్రీగణేష్ చేతుల మీదుగా ట్రోఫీతో పాటు రూ.10 వేల గదును అందజేశారు. అదే విధంగా రన్నర్స్ బ్ల్యూ ఫ్లేస్ టీమ్‌కు ట్రోఫీతో పాటు రూ. 5 వేల నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రేమ్, బోయిన్‌పల్లి మార్కెట్ మాజీ వైస్ ఛైర్మన్ చింతల వేణుగోపాల్‌రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు కన్నన్ నర్సింహన్, జయప్రకాశ్, ఖదీర్‌వన్ తదితరులు పాల్గొన్నారు.

## దేశ భవిష్యత్తు విద్యార్థుల చేతుల్లోనే

**ఎల్.బి.నగర్, సెప్టెంబర్ 21 ప్రభాతవార్త:** భారతదేశ భవిష్యత్తు నేటి విద్యార్థుల చేతుల్లోనే ఉందని టిజిసిహెచ్ఈ ఛైర్మన్ వి.బాలకిష్టారెడ్డి పేర్కొన్నారు. నాగోలు కళ్యాణలక్ష్మి గార్డెన్లో శనివారం అవంతి డిగ్రీ, పీజీ కళాశాల ఉమాంగ్ టూకే 25 పేరిట ఫ్రెషర్స్‌డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ప్రపంచంలో భారత్ 3వ అతిపెద్ద ఆర్థిక దేశంగా ఎదిగిందని అందులో నేటి విద్యార్థులు కీలకపాత్ర పోషించాలని సూచించారు. రైసింగ్ తెలంగాణ పేరిట ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. డిగ్రీ ద్వారా అనేక ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని, అవకాశాలను విద్యార్థులు తమ ప్రతిభ ద్వారా అందిపుచ్చుకోవాలని సూచించారు. మాజీ మంత్రి అవంతి గ్రూప్స్ ఫౌండర్ ఛైర్మన్ ఎం.శ్రీనివాసరావు ఎన్‌టివి సిఈఓ రాజశేఖర్, ఎఫ్‌టిసిసిఐ వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# రాజకీయ లబ్ధి కోసం విమర్శిస్తే సహించేది లేదు



ఆలయంలో పూజలు చేస్తున్న ఎంపి సురేష్ శెట్కార్ కుటుంబ సభ్యులు

## పంచలింగేశ్వర ఆలయంలో శెట్కార్ కుటుంబ సభ్యుల పూజలు

**మనూర్, సెప్టెంబరు 21, ప్రభాతవార్త:** మండల పరిధిలోని బాధల్‌గావ్ గ్రామంలోని శ్రీపంచలింగేశ్వరస్వామి ఆలయంలో శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని జహీరాబాద్ ఎంపి సురేష్‌కుమార్ శెట్కార్ కుటుంబ సభ్యులు(జితేందర్ శెట్కార్, మాజీ జడ్పీటిసి సంగీత శెట్కార్, ఉమాదేవి శెట్కార్, ప్రభావతి శెట్కార్, శివరావు శెట్కార్, రాజశేఖర్ శెట్కార్) అర్చ కులు వేద మంత్రాలు వల్లిస్తుండగా అభిషేక పూజలు నిర్వహించారు. ఆల యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి ఆలయానికి చేరుకున్న భక్తులకు శెట్కార్ కుటుంబ సభ్యుల సహకారంతో ప్రసాద వితరణ (అన్న దానం) చేశారు. ఆలయంలో పూజా కార్యక్రమాలు నిర్వహించిన శెట్కార్ కుటుంబ సభ్యులను ఆలయ కమిటి ఘనంగా సన్మానించారు. కార్యక్రమం లో నారాయణఖేడ్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు శివకాంత్ పటేల్, గ్రామస్థులు లింగప్ప పటేల్, వినయ్‌కుమార్, డాక్టర్ అమృత్, దత్తు, యాదయ్య, నర్సింలు, విఠల్ తదితరులు పాల్గొన్నారు.

## అమావాస్య అన్నప్రసాద వితరణ



అన్నదానం చేస్తున్న ఆర్యవైశ్య నాయకులు

**గజ్వేల్, సెప్టెంబరు 21, ప్రభాతవార్త :** గజ్వేల్ ఇందిరాపార్క్ చౌరస్తా వద్ద ఆదివారం మహాలయ అమావాస్య సందర్భంగా వాసవీ సేవా సమితి ఆధ్వర్యంలో ఆర్యవైశ్య నాయకులు అమావాస్య అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మున్సిపల్ ఛైర్మన్ రాజమౌళి, మాజీ ఉపసర్పంచ్ నంగునూరి సత్యనారాయణ, ఇటిక్యాల మాజీ సర్పంచ్ రావికంటి చంద్రశేఖర్ మాట్లాడుతూ అమావాస్య రోజున అన్నదానం చేస్తే పితృదేవతలకు మోక్షం కలుగుతుందన్నారు. మహాలయ అమావాస్య సంద ర్భంగా వాసవి కన్యకాపరమేశ్వరి చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు నిర్వహించారు. 11 మంది పురోహితులకు బియ్యం, నిత్యావసర వస్తువులు అందజేసి అమావాస్య అన్నదాన కార్యక్రమం అనంతరం నిరుపేద మహిళ లకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాచారం దేవస్థానం డైరెక్టర్ జగ్గయ్యగారి శేఖర్,ఎఎంసి డైరెక్టర్ మహంకాళి శ్రీనివాస్, ఆర్యవైశ్య నాయకులు బిక్షపతి, లక్ష్మయ్య, శ్రీనివాస్, కైలాస్ ప్రభాకర్, సుధాకర్, సంపత్, రమేష్, విజయ్, సత్యనారాయణ, శ్రీనివాస్, రుక్మయ్య, ప్రశాంత్, శ్రీను, శ్రీహరి, సంతోష్, చంద్రశేఖర్, శంకరయ్య, సంతోష్ పాల్గొన్నారు.

## ఆమ్ ఆద్మీ పార్టీతోనే అన్ని వర్గాలకు న్యాయం

### రాష్ట్ర కన్వీనర్ సుధాకర్



మాట్లాడుతున్న సుధాకర్

**సంగారెడ్డి మున్సిపాలిటీ సెప్టెంబరు 21, ప్రభాతవార్త :** ఆమ్ ఆద్మీ పార్టీ నాయకత్వంలోనే అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమం అభివృద్ధి ఫలాలు అందుతాయని ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కన్వీనర్ దిడ్డి సుధాకర్ అన్నారు జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలో నిర్వహించిన జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ఆత్మీ పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రాలలో తాము ఇచ్చిన హామీలను అమలు చేసి చూపించడం జరిగిందని ఆయన గుర్తు చేశారు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో ఆమ్ ఆద్మీ పార్టీ కూడా పోటీ చేస్తుందని దానికి అవసరమైన ప్రణాళికలు తో ముందుకు సాగుతున్నామని ఆయన స్పష్టం చేశారు ఈ సందర్భంగా జిల్లా పార్టీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. కార్య క్రమంలో తెలంగాణ సెంట్రల్ జోన్ కమిటీ సభ్యులు సల్మాన్ రాజు రాష్ట్ర మాజీ కన్వీనర్ రాము గౌడ్ రాష్ట్ర నాయకులు విజయ మల్లంకి జిల్లా అధ్యక్షులు మిట్టపల్లి రాజేశ్వర్ సంగారెడ్డి నియోజకవర్గ మహిళా శాఖ అధ్య క్షురాలు ఉమారాణి నర్సాపూర్ నియోజకవర్గ కన్వీనర్ కృష్ణ నాయకులు రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## కాలుష్యాన్ని వెదజల్లే పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలి : సిపిఐ




పిసిబి కార్యాలయం ముందు ధర్నా నిర్వహిస్తున్న సిపిఐ నాయకులు

**సంగారెడ్డి మున్సిపాలిటీ సెప్టెంబరు 20, ప్రభాతవార్త :** కాలుష్యాన్ని వెదజల్లుతున్న పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలనికోరుతూ భారత కమ్యూ నిస్టు పార్టీ(సిపిఐ) ఆధ్వర్యంలో సంగారెడ్డిలోని పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ముందు ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో సిపిఐ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి ఎంఏ రెహమాన్, ఆర్.లక్ష్మి, సిహెచ్.అశోక్, మానెమ్మ, విజయ లక్ష్మి, అనుసుజ బిజెఆర్‌ఎస్‌ఎస్ జిల్లా కార్యదర్శి వేణుగోపాల్ పాల్గొన్నారు.

## చదువుతోనే మనిషికి సమాజంలో గౌరవం

**కొండపాక, సెప్టెంబరు 21, ప్రభాతవార్త :** చదువుతోనే సమాజంలో మనిషికి గౌరవం లభిస్తుందని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు కొమ్ము విజయ్‌కుమార్ అన్నారు. కొండపాక గ్రామానికి చెందిన జాలిగామ హరిక మెడిసిన్‌లో సీట్ సాధించినందుకు అమెను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలోని అస మానతలు తొలగిపోవాలంటే చదువు ఒక్కటే మార్గమన్నారు. కార్యక్రమం లో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉసాధ్యక్షుడు ఎర్రుపల మల్లేశం, ఎఎన్ఎస్‌యుఐ జిల్లా కార్యదర్శి భానుచందు, హరిక కుటుంబ సభ్యులు రామకృష్ణ, రాజు, పర్శరాములు, కనకరాజు, మహిపాల్, యాదయ్య పాల్గొన్నారు.



సీటు సాధించిన హరికను సన్మానిస్తున్న విజయ్ కుమార్

### బిఆర్ఎస్ నేత వంటేరు విజయవర్ధన్‌రెడ్డి

**గజ్వేల్, సెప్టెంబరు 21, ప్రభాతవార్త :** రాజకీయ లబ్ధికోసం విమర్శలు చేస్తే సహించేది లేదని, ప్రజ్ఞాపూర్ ఊరచెరువు కాలువలపేరిట తమ కుటుంబాన్ని వివాదంలోకి లాగితే బిజెపి నేతలపై పరువునష్టం దావా వేస్తామని బిఆర్ఎస్ నాయకులు బూర్గుపల్లి మాజీ సర్పంచ్ వంటేరు విజయవర్ధన్ రెడ్డి అన్నారు. ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మత్తడి నీళ్ల వెళ్లే మార్గం పార్టీవేశ్వరనగర్‌లో ఉండేది కానీ అప్పు డున్న మున్సిపల్ ఛైర్మన్ గాడిపల్లి భాస్కర్ అవినీతి మత్తుల జోగుతూ మున్సిపల్ అభివృద్ధిని పట్టించు కోలేదన్నారు. భాస్కర్ తన హయాంలో అభివృద్ధిని గాలికి వదిలేసి అవినీతికి పాల్పడి భవిష్యత్ తరా లకు నష్టం జరుగుతుందన్న విషయం తెలిసిన పట్టించుకోకుండా అవినీతి అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. ఆరోజు భాస్కర్ చేసిన ఘనత వలనే ఈ రోజు ప్రజ్ఞాపూర్ ఊర చెరువు నీళ్ల రోడ్లపైకి వస్తున్నాయన్నారు. మీకు దమ్ము ధైర్యం ఉంటే ఇప్పటికైనా పార్టీవేశ్వరనగర్ ప్రజ్ఞాపూర్ మత్తడి కల్వర్టు పనులకు ఎంపి నిధులు తీసుకవచ్చి కల్వర్టు పనులు పునరుద్ధరించి సమస్యను పరిష్కరించాల న్నారు. భాస్కర్ మున్సిపల్ ఛైర్మన్‌గా ఉన్న సమ యంలోనే మా వెంచర్‌లో 216 ప్లాట్లకు చట్టపరం గా అనుమతులు వచ్చాయన్నారు. అది తెలిసికూడా సోయి లేకుండా మాట్లాడడం సరికాదన్నారు. వెం చర్‌కు అన్ని రకాలుగా చట్టపరంగా అనుమతులు ఉన్నాయని ఎక్కడా అభియోగాలు లేవన్నారు. ఇప్పటికైనా పనికిమాలని ఆరోపణలు మానుకొని నిజనిజాలు తెలుసుకొని మాట్లాడాలని లేని పక్షంలో ఆరోపణలు చేస్తున్న వారిపై చట్టపరంగా పరువు నష్టం దావా వేస్తామని హెచ్చరించారు. సమావేశం లో బిఆర్ఎస్ నాయకులు బెండ మధు, నవాజ్ మీరా, మరికంటి కనకయ్య, అహ్మద్, దాకాని బిక్షపతి, ఎల వెంకటేశం, సాయి, చేవర్తి సురేష్, స్వామిచారి తదితరులు పాల్గొన్నారు.



ప్రజ్ఞాపూర్ ఊర చెరువు మ్యాప్‌ను చూపిస్తున్న బిఆర్ఎస్ నాయకుడు విజయవర్ధన్‌రెడ్డి



కుకునూరుపల్లిలో అన్న ప్రసాద వితరణ నిర్వహిస్తున్న దృశ్యం

## అమావాస్య రోజు అన్న వితరణ

**కొండపాక, సెప్టెంబరు 21, ప్రభాతవార్త :** మండల కేంద్రంలో మహాలయ అమావాస్య, పెత్తరమాసను పురస్కరించుకొని అర్యవైశ్య సంఘం వాసవీ క్లబ్ అదివారం అమావాస్య దాన సేవా సమితి అధ్వర్యంలో వనపర్తి అశోక్‌కుమార్ సహకరంతో తండ్రి కీర్తిశేషులు వనపర్తి కిష్టయ్య జ్ఞాపకార్థం అన్నప్రసాద విత రణ నిర్వహించారు. ఈ సందర్భంగా 300 మందికి అన్న ప్రసాద వితరణ చేసినట్లు వనపర్తి అశోక్ కుమార్ తెలిపారు.కార్యక్రమంలో అర్యవైశ్య సంఘం నాయకులు కాచం నవీన్‌కుమార్, ఉప్పాల పాండురంగం, గంగిశెట్టి శ్రీనివాస్, పాండురంగం, రాజ్‌కుమార్, ఉప్పల రాజు, వెంకటేశం, చంద్రమౌళి, నాగరాజు, సంతోష్, బాలయ్య, సత్యం, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## కుకునూరుపల్లిలో ఉచిత వైద్య శిబిరం

**కొండపాక, సెప్టెంబరు 21, ప్రభాతవార్త :** మహిళలు అరోగ్యంగా ఉంటేనే కుటుంబం మొత్తం అరోగ్యవంతంగా ఉంటుందని కుకునూరుపల్లి పిహెచ్‌సి వైద్యాధికారిన పర్వీన్ అన్నారు. శనివారం కుకునూరుపల్లి పిహెచ్‌సిలో జిల్లా వైద్యాధికారి ధన్‌రాజ్ అదేశాల మేరకు అరోగ్య మహిళ శక్తివంతమైన కుటుం బం అనే కార్యక్రమంలో భాగంగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం జరి గింది. ఉచిత వైద్య శిబిరం డాక్టర్ పర్వీల్ అధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అమె మాట్లాడుతూ ఇంటి ఇల్లాలు అరోగ్యంగా ఉంటేనే కుటుంబ సభ్యులంతా అరోగ్యంగా ఉంటరన్నారు. ఉచిత వైద్య శిబిరంలో పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ జ్యోతి, జనరల్ ఫిజిషియన్ డాక్టర్ వెంకట సాయి, స్త్రీ వైద్య నిపుణులు, హరిక చర్మ వైద్య నిపుణులు, సంధ్యరాణి కంటి వైద్య నిపుణులు, చెవి, ముక్కు, గొంతు నిపుణులు డాక్టర్ ప్రణీత, దంత వైద్య నిపుణులు శ్రీజ, మానసిక వైద్య నిపుణులు డాక్టర్ నవీన్‌లు రోగులకు వైద్య సేవలందించారు. కార్యక్రమంలో హెచ్ఈఓ ప్రేమ్‌చంద్, సూపర్‌వైజర్ సుజాత, కుకునూరుపల్లి వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సిఎం సహాయనిధి పేదలకు వరం : లింగారావు

**కొండపాక, సెప్టెంబరు 21, ప్రభాతవార్త :** సిఎం సహాయనిధి పేదలకు ఎంతో ఉపయోగపడుతుందని కాంగ్రెస్ పార్టీ కొండపాక మండల అధ్యక్షుడు వాసరి లింగరావు అన్నారు. జప్తినాచారం, వెలికట్ట, రవీంద్రనగర్, దుద్దెడ గ్రామాల్లోని సిఎం సహాయనిధి లబ్ధిదారులకు అయన చెక్కులను అందించి మాట్లాడారు. పేదలు కార్పొరేట్ అసుపత్రుల్లో ఖరీదైన వైద్యం చేయించుకున్న వారిని అర్థికంగా అదుకుంటుదన్నారు. వైద్యం చేయించుకున్న బాధితులు అప్పులపాలు కాకుండా సిఎం సహాయనిధి మనోధైర్యాన్నిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఎఎంసి డైరెక్టర్ పెరుగు తిరుపతి, ఇందిరమ్మ కమిటీ సభ్యులు సిద్దులు, మగ్దుమ్ తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి : సిఐ

**సిద్దిపేట అర్బన్, సెప్టెంబర్ 21, ప్రభాతవార్త :** గంజాయి, డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాల జోలికి వెళ్లొద్దని...సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని పట్టణ త్రీ టౌన్ సీఐ విద్యాసాగర్ అన్నారు. సీపీ డాక్టర్ బి.అనురాధ ఆదేశాల మేరకు మండల పరిధిలోని మిట్టపల్లి గ్రామాన్ని ఆదివారం సందర్శించి గ్రామస్తులతో ఆయన మాట్లాడారు. ప్రజల రక్షణ, సెన్సాఫ్ సెక్యూరిటీ కోసం సిసి కెమెరాలు చాలా ముఖ్యమన్నారు. సిసికెమెరాల ఏర్పాటుకు ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలన్నారు. ఎక్కడైనా మత్తు పదార్థాలు అమ్మిన, కలిగి ఉన్న సేవించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ప్రభు త్వం నిషేధించిన గుడుంబా నాటు సారా తయారు చేయడం నేరమన్నారు. ఆన్‌లైన్ మోసాల బారిని పడొద్దని ఎవరైనా సైబర్ నేరాల బారిన పడితే వెంటనే 1930 సైబర్ సెల్ జాతీయ నంబరుకు ఫోన్ చేయాలన్నారు. గ్రామం లో ఎవరూ బెల్టుషాపులు నిర్వహించొద్దన్నారు. ప్రజల సమస్యలు తీర్చడానికి ఎల్లవేళలా అందుబాటులో ఉండి సేవలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, గ్రామస్తులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.



గ్రామస్తులతో మాట్లాడుతున్న త్రీ టౌన్ సీఐ విద్యాసాగర్



మాట్లాడుతున్న జెవివి రాష్ట్ర కమిటీ సభ్యులు బాలరాజు

## దేశంలో పెరుగుతున్న అసమానతలు

### జెవివి రాష్ట్ర కమిటీ సభ్యుడుబాలరాజు

**సిద్దిపేట అర్బన్, సెప్టెంబరు 21,ప్రభాతవార్త :** మారుతున్న పరిస్థితులకు, సమాజ ధోరణికి, రాజకీయ పరిస్థితులను గమనించి జెవివి సైన్స్ ప్రచారం, శాస్త్రీయ వైఖరులు పెంపొందించుటకు కార్యక్రమాలు చేపట్టాలని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కమిటీ సభ్యులు మొలుగు బాలరాజు అన్నారు. జన విజ్ఞాన వేదిక జిల్లా కమిటీ ప్లీనము సమావేశం జిల్లా కేంద్రంలోని జెవివి కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశానికి స్వాతంత్రం వచ్చి 79 ఏళ్లు పూర్తయినా ఇప్పటికీ సమానత్వం సాధించకపోగా అసమానతలు పెరుగుతున్నాయన్నారు. జిల్లాలో జెవివి సభ్యత్వం రాబోవు రోజుల్లో మరింత పెంపొందించాలని జిల్లా కమిటీకి సూచించారు. జిల్లా అధ్యక్షులు తుమ్మ సత్యం మాట్లాడుతూ సమాజంలో చాలా మందికి సైన్స్ అంటే ఏమిటో తెలిసినప్పటికీ శాస్త్రీయ వైఖరి కొరబడిందని దీంతో అనేక మూఢాచారాలు సమాజంలో కొనసాగుతున్నాయన్నారు. జిల్లా ప్రధాన కార్య దర్శి కొమ్ము కనకరాజు మాట్లాడుతూ జిల్లాలో జెవివి కార్యక్రమాలను ఉధృ తంగా చేపట్టి సైన్స్ ప్రచార ఉద్యమాన్ని మరింత బలోపేతం చేద్దామన్నారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి ఎం.డి.అజీజ్, సైన్స్ ప్రచార రాష్ట్ర కమిటీ సభ్యులు సాదత్ అలీ, జెవివి సభ్యులు కె.మహేందర్, జి.ప్రవీణ్, సుధాకర్,జె.చంద్రశేఖర్, శ్రీనివాస్, సమీర్ తదితరులు పాల్గొన్నారు.

## 4వ వార్డులో హైమాస్ట్ లైట్లు ప్రారంభం



ఐమాక్స్ విద్యుత్ దీపాలను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ మంజుల

**సిద్దిపేట అర్బన్, సెప్టెంబరు 21, ప్రభాతవార్త :** జిల్లా కేంద్రంలోని 4వ వార్డులో మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు ఆదేశాల మేరకు మున్సిపల్ చైర్మన్ కడవేర్గు మంజుల రాజనర్సు వైస్ చైర్మన్ కనకరాజు, వార్డు కౌన్సిలర్ కొండం కవితసంపత్‌రెడ్డిలతో కలిసి ఆదివారం ఐమాక్స్ విద్యుత్ దీపాలను ప్రారంభించారు. అనంతరం బతుకమ్మ సంబరాలలో భాగంగా వార్డులో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో వార్డు కౌన్సిలర్ కొండం కవిత సంపత్‌రెడ్డిలతో కలిసి ఆడిపాడారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు కొండం సంపత్‌రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్సు, కౌన్సిలర్లు అరవింద్‌రెడినడ, బర్ల మల్లికార్జున్, తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైన విద్యార్థిని

**రామాయంపేట మున్సిపాలిటీ, సెప్టెంబరు 21, ప్రభాతవార్త :** స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన ఉమ్మడి మెదక్ జిల్లా బ్యాడ్మింటన్ పోటీలలో స్థానిక వివేకానంద విద్యాలయంకు చెందిన 9వ తర గతి విద్యార్థిని పి.వర్షిని అండర్17 బాలికల విభాగంలో అత్యుత్తమ ప్రతిభ కన బరిచి, విజేతగా నిలిచింది. ఇందుకుగానూ త్వరలో నిర్వహించబోయే రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీలలో ఉమ్మడి మెదక్ జిల్లా తరపున పాల్గొననున్నది. రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థిని వర్షిని ని, సహకరించిన పీఈటీలను పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఏ.రామ్ కుమార్ అభినందిస్తూ రాష్ట్రస్థాయిలో కూడా విజయం సాధించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలన్నారు.



విద్యార్థిని వర్షిణిని అభినందిస్తున్న పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామ్‌కుమార్

# పామాయిల్‌కు బీజం వేసింది కెసిఆర్, హరీష్‌రావులే

### మాజీ ఎంపిపి జాప శ్రీకాంత్‌రెడ్డి

**నంగునూర్, సెప్టెంబరు 21, ప్రభాతవార్త :** నంగునూర్ మండలం నర్మెట గ్రామంలో రూ. 300 కోట్ల వ్యయంతో నిర్మించిన ఆయిల్‌ఫాం ఫ్యాక్టరీకి మొదటిసారిగా బీజం వేసింది మాజీ సిఎం కెసిఆర్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావులేనని మాజీ ఎంపిపి జాప శ్రీకాంత్‌రెడ్డి, మాజీ జడ్పీ వైస్ చైర్మన్ రాగుల సారయ్య, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు లింగంగౌడ్‌లు అన్నారు. ఆదివారం మం డల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమా వేశంలో వారు మాట్లాడారు. నర్మెట గ్రామంలో ఫ్యాక్టరీ ఏర్పాటుకు బీజం వేసింది బిఆర్ఎస్ నాయ కులు మాజీ సిఎం, మాజీ మంత్రి హరీష్‌రావులైతే కాంగ్రెస్ నాయకులు ఫ్యాక్టర్టీ మేమే ఏర్పాటు చేశా మని చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. బిఆర్ఎస్ అధి కారంలోకి వచ్చిన తర్వాత తెలంగాణ ప్రాంత రైతులు అభివృద్ధి చెందాలనే ఉద్దేశ్యంతో తెలంగాణ ప్రాంతంలో పామాయిల్ తోటలను ఏర్పాటు చేసిన ఘనత హరీష్‌రావుకే దక్కుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు అయిల్ ఫాం ఫ్యాక్టరీని మేమే ఏర్పాటు చేశామని చెప్పుకోవడాన్ని చూసి ప్రజలు, రైతులు నవ్వుకుంటున్నారని తెలిపారు. అబద్దాలు, మాయ మాటలు చెప్పడంలో కాంగ్రెస్ నాయకులు రేవంత్‌రెడ్డిని మించిపోయారని తెలిపారు.కాంగ్రెస్ నాయకులు చెప్పే మాయ మాటలు ప్రజలు నమ్మ రని తెలిపారు.

సమావేశంలో నాయకులు మల్లయ్య, వెంకట రెడ్డి, కోల రమేష్‌గౌడ్, ఎల్లంకి మైపాల్‌రెడ్డి, కోల మహేందర్‌గౌడ్,లక్ష్మారెడ్డి, వేణుచక్రవర్తి, మల్లయ్య, పర్శరాములుగౌడ్ తదితరులుపాల్గొన్నారు.




మాట్లాడుతున్న బిఆర్ఎస్ నాయకులు

## మండపాల ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరి : ఎస్ఐ

**మనూర్, సెప్టెంబరు 21, ప్రభాతవార్త:** దేవి శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ఈ నెల 22వ తేదీ నుంచి గ్రామాల్లో మండపాలను ఏర్పాటుచేసుకుని అమ్మవార్లను ప్రతిష్టించుకుని పూజలు నిర్వహించే నిర్వా హకులు ముందస్తుగా ఆన్‌లైన్‌లో మండపాల వివరాలు దరఖాస్తు చేసుకో వాలని ఎస్ఐ కోటేశ్వర్‌రావు సూచించారు. మండపాల వద్ద తగు జాగ్రత్తలు తీసుకోవాలని నిర్వాహకులకు ఎస్ఐ సూచించారు. దసరా పండగ వేడుకలను భక్తి శ్రద్ధలతో ప్రశాంత వాతావరణంలో శాంతియుతంగా జరుపుకుని అమ్మవారి ఆశీస్సులు అందుకోవాలని భక్తులకు సూచించారు.

## వీరభద్రాలయంలో పూర్ణాహుతి, రుద్ర హోమం

**గుమ్మడిదల, సెప్టెంబరు 21 ప్రభాతవార్త :** గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని బొంతపల్లి వీరన్నగూడెంలో కొలువై ఉన్న వీరభద్ర స్వామి దేవస్థానంలో ఆదివారం అమావాస్య సందర్భంగా రుద్ర హోమం, పూర్ణా హుతి, కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, చేతులమీదుగా పర్యవేక్షకుల సోమయ్య ఆధ్వర్యంలో నిర్వ హించడం జరిగింది. అమావాస్య పురస్కరించుకొని పూజలు హోమం కుటుంబ సమేతంగా భక్తులు పాల్గొని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు ఆలయ కమిటీ సభ్యులు, ధర్మకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా బతుకమ్మ వేడుకలు



దుర్గమ్మ దేవాలయంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

**చేర్యాల, సెప్టెంబరు 21, ప్రభాతవార్త :** ఎంగిలిపూల బతుకమ్మ వేడుక లను మండల వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు.తీరొక్క పూలతో బతు కమ్మలను అందంగా పేర్చిన మహిళలు ఉత్సాహంగా పాటలు పాడుతూ గౌరమ్మను కొలుస్తూ బతుకమ్మల చుట్టూ తిరిగారు.చేర్యాల పట్టణంలోని బతుకమ్మ కుంట (కుడి చెరువు),దుర్గమ్మ దేవాలయ ఆవరణలో బతుకమ్మ లను ఒక చోట పెట్టి మహిళలు,యువతులు పెద్దఎత్తున తరలివచ్చి బతుకమ్మ ఆటపాటలతో హోరెత్తించారు.వాయినాలు ఇచ్చిపుచ్చుకున్న అనంతరం బతుకమ్మలను నిమజ్జనం చేశారు.

**కొండపాక మండలంలో...**

కొండపాక, సెప్టెంబరు 21, ప్రభాతవార్త : రాష్ట్రంలో అతి ఘనంగా జురుపుకునే పండగ బతుకమ్మ పండుగ అందులో భాగంగా మొదటి రోజు పెత్తరమావాస్యను పురస్కరించుకొని అదివారం ఎంగిలిపూల బతుకమ్మతో పండగను ప్రారంభించారు. కుకునూరుపల్లి, కొండపాక మండలాల్లోని అన్ని గ్రామాల్లో బతుకమ్మ పండుగను మహిళలు రకారకాలపూలతో బతుకమ్మను పేర్చి సంతోషంగా మహిళలు, బాలికలు రకారకాల పాటలు పండుతు అడుకున్నారు. తెలంగాణ సంస్కృతికి ప్రతీక, తెలంగాణ రాష్ట్ర ప్రతిష్టను ప్రపంచానికి చాటి చెప్పె గొప్ప పండుగ బతుకమ్మ, పూలను పూజించే సాంప్రదాయం అనాధిగా తెలంగాణ కొనసాగుతుంది. తొమ్మిది రోజులు అడుకొని చివరి రోజు సద్దుల బతుకమ్మతో పండుగా ముగుస్తుంది.

**కొమురవెల్లి మల్లికార్జునస్వామి దేవాలయంలో...**



కొమురవెల్లిలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

**కొమురవెల్లి, సెప్టెంబరు 21,ప్రభాతవార్త :** శ్రీకొమురవెల్లి మల్లికార్జున దేవాలయ ప్రాంగణం వద్ద తెలంగాణ సాంప్రదాయ వైభవానికి ప్రతీకగా నిలిచే తొలిరోజు బతుకమ్మ సంబరాలు ఘనంగా ప్రారంభమైనాయి. మహా లయ అమావాస్య సందర్భంగా ఎంగిలిపూల బతుకమ్మతో తొమ్మిది రోజుల పాటు బతుకమ్మ వేడుకలు సాగనున్నాయి. ప్రతి రోజు వేర్వేరు రకాల పూలతో బతుకమ్మలను అలంకరించి సాంప్రదాయ గేయాలు, అలపిస్తూ ఆటలు ఆడుతూ మహిళలు పండుగలో పాల్గొంటారు. మొదటి రోజు ఎంగిలి పూలబతుకమ్మ సంబరాలలో మహిళలు పెద్దయెత్తున ఉత్సాహం గా పాల్గొని బతుకమ్మ ఆట పాటలు ఆడిపాడారు. అనంతరం బతుకమ్మలను చెరువులో నిమజ్జనం చేశారు.

## నర్సాపూర్‌లో అన్నదానం



అన్న ప్రసాదాన్ని వడ్డిస్తున్న మురళీయాదవ్ తదితరులు

**నర్సాపూర్, సెప్టెంబరు 21, ప్రభాతవార్త :** మహలయ పెద్దల అమా వాస్య పండగను పురస్కరించుకొని నర్సాపూర్‌లో ఆదివారం బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మాజీ మున్సిపల్ చైర్మన్ మురళియాదవ్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. పెద్దల అమావాస్య రోజున తల్లి దండ్రుల జ్ఞాపకాలతో ఈ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మురళి యాదవ్ తెలిపారు. అన్నదాన కార్యక్రమంలో బిజెపి నాయకులతోపాటు ప్రజలు అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు పాప గారి రమేష్ గౌడ్, జిల్లా ఉపాధ్యక్షులు మాజీ కౌన్సిలర్ బుచ్చేష్ యాదవ్, మాజీ అసెంబ్లీ కన్వీనర్ హెచ్.వి.రమణారావు, మాజీ కౌన్సిలర్లు గోద రాజేందర్, ఎర్ర గొల్ల లతా రమేష్ యాదవ్, బిజెపి జిల్లా కోశాధికారి ఆంజనేయులు గౌడ్, పట్టణ అధ్యక్షులు నీరుడు చంద్రయ్య, నాయకులు అశోక్ యాదవ్, కంది ప్రభాకర్, దేవేందర్ యాదవ్, రమేష్ యాదవ్ శ్రీనివాస్ యాదవ్, శివ, చంద్రశేఖర్, లక్ష్మణ్ యాదవ్, నవీన్ యాదవ్, ముజాహిద్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## నిష్టతో దీక్షలను కొనసాగించాలి

**చౌటకూరు, సెప్టెంబరు 21, ప్రభాతవార్త:** నిష్టనియమాలతో చేపట్టిన దీక్షలను నిర్వహించాలని పౌరాదేవి గురుశేఖర్ మహారాజ్ సూచించారు. ఆదివారం బొమ్మరెడ్డిగూడెంలోని భవానిమాత, సేవాలాల్ మహారాజ్ ఆల యంలో భోగ్ పూజలను దీక్షాపరులతో కలిసి మహారాజ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మహారాజ్ దీక్షాపరులకు పులు సూచనలు చేశారు. దీక్షల తో ఆధ్యాత్మిక చింతన మెరుగుపడుతుందని, ప్రశాంతత, భక్తి భావం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో దీక్ష మహారాజ్‌లు దేవిదాస్ హెడా మ్సర్, సురేందర్, శంకర్‌నాయక్, రవీందర్‌నాయక్, రాములు, హరిసింగ్, గిరిజన సంక్షేమ సంఘం ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షులు జైపాల్‌నాయక్, శివాజీ, సంతోష్, ఆకాష్, విశాల్,విగేష్, ప్రవీణ్, సాయిగౌతమ్, ఆనంద్ పాల్గొన్నారు.



భోగ్ పూజలు నిర్వహిస్తున్న పౌరాదేవి గురు శేఖర్ మహారాజ్

## సిసి రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం



రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న నాయకులు ముని

**దుద్యాల్, సెప్టెంబరు 21, ప్రభాతవార్త:** మండలంలోని పోలేపల్లి శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం ప్రాంగణంలో సీసీ రోడ్డు నిర్మాణ ప నుల ం ప్రారంభించారు. రూ. 75 లక్షల కాద నిధులతో సీసీ రోడ్డు ప నుల ం ప్రారంభించినట్లు దేవస్థానం చైర్మన్ జయరాములు, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేర్గు వెంకటయ్య తెలిపారు. రేణుక ఎల్లమ్మ ఆలయం అభివృద్ధి చేసేందుకు సీఎం రేవంత్ రెడ్డి, కోడంగల్ నియోజకవర్గం ఇన్చార్జి తిరుపతిరెడ్డి కృషి చేస్తున్నట్లు తెలిపారు. దేవస్థానం కమిటీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## శరన్నవరాత్రి మహోత్సవ వేడుకలు

**కడ్తాల్, సెప్టెంబరు21, ప్రభాత వార్త :** దేవి శరన్నవరాత్రి మహోత్సవాలకు కడ్తాల్ మండలం మైసిగండి గ్రామంలో మైసమ్మ తల్లి ఆలయం విద్యుత్ తోరణాలతో శోభాయమానంగా తీర్చిదిద్దారు. నేటి నుండి అక్టోబర్ రెండవ తేదీ వరకు దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు నిర్వహించనున్నారు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ట్రస్ట్ చైర్మన్ లక్ష్మీ శిరోలి పంతూనాయక్, ఈఓ స్నేహ తెలిపారు

## ప్రమాదకరంగా మారిన రోడ్డు



**శామీర్‌పేట, సెప్టెంబరు 21, ప్రభాతవార్త:**మూడుచింతలపల్లి–లింగాపూర్ తండ గ్రామాల మధ్య గల మెయిన్ రోడ్డుకు వర్షాలతో నీరు చేరటంతో ఆ రోడ్డు ప్రమాదకరంగ మారింది. మూడుచింతలపల్లి మున్సిపల్ ఆఫీస్ చేరువలో ఉన్న శాలివాని కుంట ఇటీవల కురిసిన వర్షాలతో నిండింది. ఆ కుంట నిండి కట్ట కింది భాగం నుంచి నీరు బయటకు రావటంతో ఆ నీరు రోడ్డుకు చేరి ప్రమాదాన్ని పొంచి ఉందని పలువురు వాపోతున్నారు. మూడుచింతలపల్లి–కీసరకు వెళ్లె ప్రధాన రోడ్డుకు వాహనాల రద్దీ అధికంగానే ఉంటుంది. అయితే మూడుచింతలపల్లి కుంట ఎంసిపల్లి మున్సిపల్ ఆఫీస్ పక్కనే ఉండటం, గతంలో ఇరిగేషన్ అధికారులు సరిగ్గా కుంట మరమ్మతు పనులు చేపట్టకపోవటంతో కుంట కింది భాగం నుంచి నీరు బయటకు రావటం ఆ నీరు రోడ్డుకు చేరి వాహనదారులకు,ప్రదానంగా ద్విచక్రవాహనదారులు రోడ్డులో నీరు నిండి ఉండటం, ఆ రోడ్డు గుంతలుగా ఉండటంతో ఇబ్బందులు పడుతున్నారని పలువురు వాపోతున్నారు. ఆర్అండ్‌బి అధికారులు, ఇరిగేషన్ అధికారులు స్పందించి కుంటకు మరమ్మతు పనులు చేపట్టాలని, అదే విధంగా ఆ రోడ్డు మరమ్మతు పనులు కూడ చేపట్టాలని వాహనదారులు, స్థానికులు పలువురు కోరుతున్నారు. రోడ్డును బాగుచేసి ప్రమాదాలను నివారించాలని కోరుతున్నారు.ఆర్అండ్‌బి, ఇరిగేషన్, మున్సిపల్ సంబంధిత అధికారులు స్పందించి వెంటనే వాటిని మరమ్మతు పనులు చేపట్టాలని వారు కోరుతున్నారు.

## పాఠశాలల అభివృద్ధికి కృషిచేస్తా

**పూడూరు, సెప్టెంబరు 21,ప్రభాతవార్త :** పాఠశాలల అభివృద్ధికి తనవంతు కృషిచేస్తానని మండల బిఆర్ఎస్ పార్టీ ఉపాధ్యక్షుడు రాయిస్‌ఖాన్ పేర్కొన్నారు.పూడూరు మండలం పరిధిలోని చెన్‌గోముల్ జిల్లా పరిషత్తు ఉన్నత,మండల ప్రాథమిక పాఠశాల,ఉర్దూమీడియం పాఠశాలల్లో ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయా పాఠశాలల ఉపాధ్యాయులను శాలువాలు, మెమెంటోలతో సన్మానించిన రాయిస్ ఖాన్ మాట్లాడుతూ జగతిలో పిల్లలకు తల్లిదండ్రుల తరువాత గురువు లకే విద్యాబుద్ధులతోపాటు మంచి నడవడిక నేర్పే బాధ్యతుందని వివరించారు .సమాజాభివృద్ధికోసం నిర్విరామంగాకృషిచేసే ఉపాధ్యాయులను జీవితంలో మరువలేమని తెలిపారు.ఈ సందర్భంగా ఆయా పాఠశాలల్లోవిద్యార్థులచేత సాంస్కృక కార్యక్రమాలు నిర్వహించారు. ప్రోగ్రాందాత ఎజాజ్‌అలీ,ఆయా పాఠశాలల ప్రధానో పాధ్యాయులు ,ఉపాధ్యాయులుప్రశాంత్‌కుమార్, చంద్రకాంత్‌రావు ,రాజు,కిష్టయ్య, శ్రీలతదేవి, మౌనిక,మున్వర్ సుల్తానా, రాంచెంద్రయ్య, ఖాజాషరీఫ్, మహిపాల్, స్వాతి, పుష్పరాణి, సరస్వతి, సోనిబాయి, హన్మంత్‌రెడ్డి ,క్రిష్ణయ్య,వెంకటయ్య పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

**తలకొండపల్లి, సెప్టెంబర్ 21, ప్రభాతవార్త :** మండలంలోని గట్టు ఇప్పలపల్లి గ్రామానికి చెందిన మమ్మద్ ఆనారోగ్యంతో మరణించడం జరిగింది. ఈ విషయం తెలుసుకున్న తలకొండపల్లి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు దోకురు ప్రభాకర్ రెడ్డి 3000 రూపాయలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గాదె రేణు రెడ్డి, మిన్నాల డేవిడ్, మాజీ వార్డ్ మెంబర్ ముకురాల నరేందర్ గౌడ్ మట్ట అంజయ్య, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఇంద్రకంటి శివకుమార్ గౌడ్‌శెట్టి రాజశేఖర్ మాజీ ఉపసర్పంచ్ చంద్రమోళి ఏదుల మచ్చేందర్ సయ్యద్ రఫిక్ వరుణ్ రాజ్ గౌడ్ శ్యామలరాహుల్‌నవీన్ గౌడ్‌కోళ్లసురేష్ పవన్ అప్సర్‌ఖాదర్ పాల్గొన్నారు.

### హామీలు నెరవేర్చాలి..!

**నందిగామ, ఆగస్టు 21, ప్రభాతవార్త:** ఎన్నికల సమయంలో ప్రకటించిన హామీలనునెరవేర్చాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ఆదివారం నర్సప్పగూడ, చేగూరు గ్రామంలో ఎమ్మార్పీఎస్ గ్రామ అధ్యక్షులు జాన్ గారి రమేష్ ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ కార్యాలయంలో ఆందోళన చేపట్టారు. చిన్నగల శ్రవణ్, కోరని మల్లమ్మ, మార్పిఎస్ కార్యకర్తలు పెద్దలు పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం



**మర్పల్లి సెప్టెంబర్ 21 ప్రభాతవార్త :** మర్పల్లి మండల కేంద్రానికి చెందిన కమ్మరి రాములు అనారోగ్యంతోఆసుపత్రీలో చికిత్స పొందుతూ ఆదివారము రోజు మృతి చెందగా ఈ విషయము తెలుసుకున్న మర్పల్లి మార్కెట్‌కమిటి మాజీ చైర్మన్ మడుగు రామేశ్వర్ మృతుడి కుటుంబాన్ని పరామర్శించి మృతుడి కుటుంబానికి 5000 వేల ఆర్థిక సహాయం అందించారు.ఆయన వెంట సహకార సంఘం వైస్ చైర్మన్ ఫక్సీ యేద్దీన్, రవిందర్‌రెడ్డి,వడ్ల వెంకటేశంచారి,వసంత్,జయంత్,కాళప్ప,చెంద్రశేఖర్ పలువురు యువకులు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# శరన్నవరాత్రులకుసర్వం సిద్ధం

**ఆమనగల్లు,సెప్టెంబరు21, ప్రభాతవార్త:** ఆమనగల్లు పట్టణంలోని శ్రీవాసవి కన్యకపరమేశ్వరి ఆలయం దేవిశరన్నవరాత్రి ఉత్సవాలకు సర్వంసిద్ధమయింది.సెప్టెంబర్ 22 నుండి అక్టోబర్4 వరకు ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. ప్రతి ఏడాదిలాగే ఏడాది కూడా ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఆలయ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లుచేశారు.శ్రీవాసవికన్యకపరమేశ్వరి ఆలయాన్ని శోభాయామానంగా తీర్చిదిద్దారు. విద్యుత్ దీపాలతో ఆలయాన్ని అలంకరించడంతో విద్యుత్ వెలుగులో ఆలయం దాని పరిసరాలు జిగేల్లుమనేలా దర్శనమిస్తుంది. ఆలయ అభివృద్ధి కమిటి అధ్యక్షుడు వీరబొమ్మ రాంమ్మోహన్‌గుప్త పర్యవేక్షణలో ఉత్సవాలకు కావలసిన ఏర్పాట్లు ఘనంగా చేపట్టారు. భక్తుల రాక పురష్కరించుకుని ఆలయం వద్ద కావలసిన ఏర్పాట్లు చేశారు. నీటివసతితోపాటు నిత్య అన్న ప్రసాద కార్యక్రమాలు చేపట్టేందుకు ఏర్పాట్లు చేశారు. కాగా శ్రీవాసవి కన్యకపరమేశ్వరి ఆలయంలో జరిగే దేవిశరన్నవరాత్రి ఉత్సవాలను తిలకించేందుకు పట్టణ భక్తులతోపాటు వివిధ ప్రాంతాల భక్తులు తరలివస్తుంటారు.అందుకనుగుణంగా సౌకర్యవంతమైన ఏర్పాట్లు గావించారు. అధ్యక్షుడు వీరబొమ్మ రాంమోహన్‌గుప్త ఆదివారం ఉత్సవాల వివరాలను వెళ్ళడిస్తూ 13రోజులపాటు అమ్మవారిని వివిధ ఆకారంలో అలంకరించి పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మొదటిరోజు సెప్టెంబర్22న శ్రీబాలత్రిపుర సుందరిదేవి, సెప్టెంబర్23



శ్రీగాయిత్రిదేవి, సెప్టెంబర్24 శ్రీఅన్నపూర్ణాదేవి, సెప్టెంబర్25న శ్రీకాత్యాయనిదేవి,సెప్టెంబర్26శ్రీధనలక్ష్మిదేవి,సెప్టెంబర్28 శ్రీలలితదేవి, సెప్టెంబర్ శ్రీశాకాంబరిదేవి, సెప్టెంబర్29న శ్రీ సరస్వతిదేవి, సెప్టెంబర్30నదుర్గాదేవి,అక్టోబర్1న మహిసాసు రమర్దిని, అక్టోబర్2నరాజరాజేశ్వరిదేవి, అక్టోబర్3 శ్రీవిజయలక్ష్మిదేవి, అక్టోబర్4న శ్రీదుర్గదేవి అవతారంలో అమ్మవారిని కొలుస్తున్నట్లు ఆయన తెలిపారు. కాగా శరన్నవరాత్రి ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆయన భక్తులను కోరారు.

## రోడ్డు ప్రమాదంలో న్యాయవాది మృతి

**వికారాబాద్, సెప్టెంబరు21, ప్రభాతవార్త:**రోడ్డు ప్రమాదంలో వికారాబాద్‌కు చెందిన సీనియర్ న్యాయవాది మృతి చెందిన సంఘటన వికారాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. ఈ సంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బంట్వారం మండలం బొపునారం గ్రామానికి చెందిన న్యాయవాది బి.బాలయ్య వికారాబాద్ కోర్టులో న్యాయవాద వృత్తిని కొనసాగిస్తూ ఇక్కడే స్థిరపడ్డాడు. వ్యక్తిగత పని నిమిత్తం ద్విచక్ర వాహనంపై శనివారం సాయంత్రం సంగారెడ్డి జిల్లా కేంద్రానికి వెళ్ళి తిరుగు ప్రయాణం అయ్యాడు. వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని కొత్తగడి గ్రామ సమీపంలోకి రాగానే, వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని కొంపల్లి గ్రామానికి చెందిన మంగళి సుభాష్ బైక్‌పై అతివేగంగా వస్తూ న్యాయవాది బాలయ్య(57) బైక్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో సుభాష్‌కు స్వల్ప గాయాలు కాగా, బాలయ్య తలకు తీవ్ర గాయం కావడంతో చికిత్స నిమిత్తం నగరంలోని అపోలో ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారు జామున బాలయ్య మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ భీమకుమార్ తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

**వికారాబాద్, సెప్టెంబరు 21, ప్రభాతవార్త :** రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన వికారాబాద్ మున్సిపల్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. ఈ సంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మున్సిపల్ పరిధిలోని కొత్రెపల్లి గ్రామానికి చెందిన బక్క నరేందర్ వ్యక్తిగత పనుల నిమిత్తం వికారాబాద్ పట్టణానికి బైక్ పై వస్తున్నాడు. సాయి డెంటల్ కళాశాల సమీపంలోకి రాగానే ఎదురుగా అతివేగంతో వస్తున్న ఇన్నోవా కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నరేందర్‌కు కాలు విరిగింది. చికిత్స నిమిత్తం నగరంలోని ఉస్మానియా ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ భీమకుమార్ తెలిపారు.

## కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

**శంకర్‌పల్లి,సెప్టెంబర్ 21, ప్రభాతవార్త :** కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన శంకర్ పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం వెలుగు చూసింది. శంకర్ పల్లికి చెందిన కమ్మరి దశరథ్ (38) గత కొంత కాలం నుండి మద్యానికి బానిసై, తాగటానికి డబ్బుల కోసం రోజు భార్యతో మరియు కుటుంబ సభ్యులతో గొడవపడేవాడు.. అదే క్రమంలో నిన్న రాత్రి అందాజ 9 గంటలకు బాగా తాగి ఇంటికి రావటంతో భార్య డాక్టర్ తాగవద్దన్నాడు కదా మల్లీ తాగావా అని అడగటం వల్ల, అందరితో గొడవపడి పక్క గదిలో తలుపులు వేసుకొని భార్య చీరతో ఉరి వేసుకోగా, వెంటనే కుటుంబ సభ్యులందరు వెళ్లి చూసే సరికి చనిపోయాడు అని మృతుని తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోస్ట్ మార్టం చేపించి దర్యాప్తు చేస్తున్నట్లు శంకరపల్లి సీఐ శ్రీనివాస్ గౌడ్ తెలిపారు.

## లంబాడీల 'గోర్' శాంతిర్యాలీ

**ఘట్‌కేసర్, సెప్టెంబర్ 21, ప్రభాతవార్త:** లంబాడీ సమాజాన్ని ఎస్‌టి జాబితా నుంచి తొలగించాలని కొందరు సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేయడంపై గోర్ అసోసియేషన్ శాంతిర్యాలీ నిర్వహించింది. ఘట్‌కేసర్ మున్సిపల్ గోర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎన్ఎఫ్‌సీనగర్‌లోని శీతల భవాణి దేవాలయం ఆవరణ నుంచి ఎదులాబాద్ రోడ్డు మీదుగా ఘట్‌కేసర్ అంబేద్కర్ విగ్రహం వరకు జెండాలు పదర్శిస్తూ నినాదాలు చేస్తూ శాంతిబైక్ ర్యాలీ జరిపారు.

సమాజ హక్కుల పరిరక్షణ కోసం లంబాడిలు పాటుపడుతారని, ఎస్‌టీ జాబితా నుంచి తొలగించాలంటూ సుప్రీంకోర్టులో పిటిషన్ వేయడం సమంజసంగా లేదన్నారు. గోర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు మాలోత్ మోతిలాల్‌నాయక్, ఉపాధ్యక్షులు రుపావత్ నరేశ్, ప్రధానకార్యదర్శి గుగులోత్ కిరణ్‌నాయక్, కోశాధికారి రమావత్ డాక్టర్ పురుషోత్తంనాయక్, గౌరవ అధ్యక్షులు రవినాయక్, శంకర్‌జీనాయక్, హనుమంత్‌నాయక్, ఉమ్లానాయక్, బాలాజీనాయక్, ఐలునాయక్, కల్చరల్ సెక్రటరీ వాలునాయక్, సోషల్ మీడియా ఇంచార్జ్ బి.సంతోష్‌నాయక్‌లతో పాటు సంతోష్, సతీష్, వెంకన్న, సురేశ్, వినోద్, చిట్టిబాబు, తిరుపతి, కిరణ్, శ్రీకృష్ణ, మహేశ్, మధు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



## సింగారంలో ఘనంగా ఎంగిలి పూలబతుకమ్మ

**యాచారం, సెప్టెంబర్21, ప్రభాత వార్త:**

యాచారం మండల పరిధిలోని నజ్దిక్ సింగారం లో బతుకమ్మ సంబరాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. చైతన్య యూత్ క్లబ్ ఆధ్వర్యంలో బతుకమ్మ నిర్వహించారు. మహిళలు ఎంతో అందంగా బతుకమ్మ లను తయారు చేసి, ఒకే చోట పేర్చారు. బతుకమ్మ పాటలతో బతుకమ్మ ఆటలు ఆడుతూ, సంస్కృతిక కార్యక్రమాలతో బతుకమ్మ సంబరాన్ని జరుపుకున్నారు. మహిళలు చిన్నారులు నూతనవస్త్రాలుధరించి సంతోషంగా బతుకమ్మ ఆటలతో చిందులు వేస్తూ ఆనంద కోలాహళంగా వేసిన కేరింతలు బతుకమ్మ కు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. చైతన్య యూత్ క్లబ్‌సభ్యులు, వన్నవాడసురేందర్‌రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, మదవాచారి, మహిళలు, యూత్‌సభ్యులు,గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఘనంగా బతుకమ్మ సంబురాలు



**కొడంగల్‌రూరల్, సెప్టెంబరు21(ప్రభాతవార్త):**బతుకమ్మ సంబరాలను కొడంగల్ పట్టణంలోని నవీన ఆదర్శ ఉన్నత పాఠశాలలో ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థులు తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి ఆటాపాటలతో అలరించారు. పాఠశాల ప్రిన్సిపాల్ డివి.నరేశ్‌రాజ్ బతుకమ్మ పండగ విశిష్టతను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల వ్యవస్థాపకులు డి.వెంకటయ్య, లక్ష్మి, వైస్ ప్రిన్సిపాల్ సంతోష, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ప్రారంభమైన బతుకమ్మ సంబురాలు



**మేడ్చల్, సెప్టెంబరు 21, ప్రభాతవార్త :** మేడ్చల్ మండలంలో బతుకమ్మ పండుగను ఘనంగా ప్రారంభమైంది. పండుగ మొదటి రోజు ఆదివారంఎంగిలిపూల బతుకమ్మతో సంబరాలను ప్రారంభించారు. మహిళలు గ్రామాల్లో బతుకమ్మను పేర్చి గ్రామ కూడలివద్దకు తీసుకొచ్చి బతుకమ్మ ఆట ఆడారు. మేడ్చల్ పట్టణంతోపాటు ఉమ్మడి మండలంలోని మేడ్చల్, గుండ్లపోచంపల్లి, ఎల్లంపేట మున్సిపాలిటీల్లోని గ్రామాల్లో మహిళలు, యువతులు ఉత్సాహంగా పండుగను జరుపుకున్నారు. అనంతరం స్థానిక చెరువుల్లో బతుకమ్మలను నిమజ్జనం చేశారు.

# పంచ పరివర్తనతో సమాజ పరివర్తనం

### ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ముందస్తు విజయదశమి ఉత్సవం,శతాబ్ది ఉత్సవాలు..

**శామీర్‌పేట, సెప్టెంబరు 21, ప్రభాతవార్త**

పంచ పరివర్తనతోనే సమాజ పరివర్తనం సాధ్యమవుతుందని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ముఖ్యవక్త కోదూరి ఓంప్రకాశ్ పేర్కొన్నారు. ఆదివారం శామీర్‌పేట మండలం తూంకుంట మున్సిపాల్టీ కేంద్రంలోని బస్తీలో ఆర్ఎస్ఎస్ ముందస్తు విజయదశమి ఉత్సవం కార్యక్రమాన్ని నిర్వహించింది. సంఘం ప్రారంభించి వంద సంవత్సరాలు పూర్తితో శతాబ్ది ఉత్సవాల పేరుతో సమాజంలో సంఘాన్ని తీసుకుని ఒక మహత్తర కార్యక్రమం గురించి దీనిలో వివరించారు. దీనిలో పాల్గొన్న ఆర్ఎస్ఎస్ ముఖ్యవక్త కోదూరి ఓంప్రకాశ్ మాట్లాడుతూ రామాయణ మహాభారతంలో జరిగినటు వంటి సంఘటనలు విజయదశమి ఉదాహరణలు, సంఘం వంద సంవత్సరాల్లో చేసిన సమాజ సేవ కార్యక్రమాల గురించి వివరించారు. పరమ పూజనీయ డాక్టర్ కేశవరావు బలిరాం పంత్ హెడ్గేవార్ 1925సంవత్సరంలో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్‌ను స్థాపించినట్లు తెలిపారు. ఆనాటి నుంచి నేటి వరకు 100సంవత్సరాలు పూర్తి చేసుకుని శతాబ్ది ఉత్సవ కార్యక్రమాలు నిర్వహించుకుంటున్నామన్నారు. సమాజంలో సంఘశక్తి కలియుగే అని చెప్పి సమాజం ద్వారానే ఈ దేశం మళ్లీ ఆ విశ్వగురు స్థానంలోకి వెళ్తుందని డాక్టర్ జీ తెలిపారని అన్నారు. ఇది భగవత్గీతలో శ్రీకృష్ణుడు అర్జునునికి చెప్పిన సందర్భంలోనిది యధా యధాయే ధర్మస్య గ్లానిర్భవతి భారత అని అనటం,...అర్జునుడు అడుగుతాడు నువ్వు ఎల్లపుడు ఎలా అవతరిస్తావు అని అడుగుతాడు. సత్యయుగంలో నరసింహుడుగా,



తూంకుంటలో జరిగిన ఆర్ఎస్ఎస్ కార్యక్రమం పాల్గొని మాట్లాడుతున్న ముఖ్యవక్త కోదూరి ఓంప్రకాశ్, ఆర్ఎస్ఎస్ సభ్యుల దృశ్యం

త్రేతాయుగంలో రాముడిగా, ద్వాపరయుగంలో కృష్ణుడిగా కానీ కలియుగంలోనే నేను వ్యక్తి రూపంలో రాను సంఘటిత సమాజం ఉన్నపుడు ఆ సమాజమే శక్తి అవుతుందని అని అంటారని కృష్ణుడు తెలిపారని ఆయన వివరించారు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ సమాజంలో పంచ పరివర్తన అనే మంత్రంతో ముందుకు వెళుతుందన్నారు. సమాజంలో ఐదు రకాలుగా పరివర్తన రావాలని సంఘం ఉద్దేశమన్నారు. కుటుంబ ప్రభోదన్, సమరసత, పర్యావరణం, స్వదేశీ, పౌర విధులు ఈ విధంగా ఐదు రకాలుగా సమాజంలో మార్పు తేవాలని సంఘం ఆలోచన అని ముఖ్యవక్త తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ ప్రముఖులు,సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు అందుబాటులో వేరుశనగ విత్తనాలు

### మండల వ్యవసాయ అధికారి తులసి

**కొడంగల్,సెప్టెంబర్ 21ప్రభాతవార్త:**

**రైతులకు అందించే**ందుకు వేరుశనగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి జీ.తులసీ తెలిపారు.వ్యవసాయ శాఖ అధ్వర్యంలో నేషనల్ మిషన్ అన్ ఎడిబ్లీ అయిల్స్.అయిల్ సీడ్స్(ఎన్ఎంఈఓ,ఓఎస్) పథకం కింద పెద్దనందిగామ,పర్సాపూర్ గ్రామాలను ఎంపిక చేయడం జరిగిందన్నారు.ఈ పథకం కింద బ్లాక్ లేవల్ డిమానిస్ట్రేషన్(బీఎల్‌డీ)కు 25 హెక్టార్లు,వాల్యుచైన్ క్లస్టర్(వీసీసీ)కు 50 హెక్టెర్లు కేటాయించబడినట్లు తెలిపారు.బీఎస్‌డీ రైతులకు వేరుశనగ విునాలు కిలోకు రూ.50.66 సబ్సీడీపై అందించడం జరుగుతుందన్నారు.ఒక్కో 20కిలోల బస్తాకు రైతులు రూ.1280 మాత్రమే చెల్లించాల్సి ఉంటుందన్నారు.వీసీసీ రైతులకు వేరుశనగ విత్తనాలు 100శాతం ఉచితంగా అందించడం జరుగుతుందన్నారు. బీఎల్‌డీ రైతులకు వీసీసీ విత్తనాలు కూడా ఇవ్వడం జరుగుతుందన్నారు ఇందుకుగాను రైతులు పట్టాదారు పాస్‌బుక్,ఆధార్‌కార్డు,సంభందిత సర్వే నంబరు యొక్కమట్టినామూనా,ఎఫ్‌పీఓ సభ్యత్వ పత్రం తీసుకురావాల్సి ఉంటుందన్నారు. విత్తనాలు తీసుకోవాలనుకునే ప్రతి రైతు తప్పనిసరిగా మట్టి నమూనా,ఎఫ్‌పీఓ కొడంగల్‌లో సభ్యత్వం(రిజిస్ట్రేషన్) చేసుకొని ఉండాలన్నారు.ఇందుకుగాను మండల పరిధిలోని పెద్దనందిగామలో సోమవారం 10గంటలకు,పర్సాపూర్‌లో మంగళవారం 10గంటలకు రైతులకు టోకెన్లు అందించడం జరుగుతుందన్నారు.రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని మెరుగైన విత్తనాలను వాడి నూనెగింజల ఉత్పత్తి పెంచుకోవాలని మండల వ్యవసాయ అధికారి జి.తులసీ తెలిపారు.

## ఆకట్టుకుంటున్న దుర్గామాత ఆలయం



**ఆమనగల్లు, సెప్టెంబర్ 21, ప్రభాతవార్త:** దేవిశరన్నవరాత్రి ఉత్సవాల సంధర్భంగా శ్రీదుర్గ భవాని ఉత్సవ కమిటి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపం చూపరులను విశేషంగా ఆకట్టుకుంటుంది. పట్టణంలోని శ్రీనివాస కాలనీలో లక్షలు వెచ్చించి మండపాన్ని పుణ్యక్షేత్రాల గాలిగోపురం ఆకారంలో ఆలయాన్ని ఏర్పాటు చేశారు. కార్మికులు వారం రోజులుగా శ్రమించి మండపాన్ని తీర్చిదిద్దారు. నీలిరంగు వర్ణంలో దేవతామూర్తుల ప్రతిమలతో మండపం చూడ ముచ్చటగా రూపొందించారు. మండపం తిలకించే సరికి నిజమైన దేవాలయం వద్దకు వచ్చిన అనుభూతి కలిగేలా తయారు చేశారు. పనులు పూర్తి కావడంతో పెద్దసంఖ్యలో భక్తులు తరలివెళ్ళి మండపాన్ని తిలకించి పులకించిపోతున్నారు. దసర పండుగ పురష్కరించుకుని శ్రీదుర్గభవాని ఉత్సవ కమిటి ప్రతి ఏడాది దేవిశరన్నవరాత్రి ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. అందులో భాగంగానే మండపాన్ని ప్రతిఏడాది ఒక్కో విధంగా రూపొందించి భక్తులను విశేషంగా ఆకట్టుకుంటున్నారు. ఈఏడాది కూడా భారీ ఖర్చుతో లక్షలు వెచ్చించి అమ్మవారి మండపాన్ని ఏర్పాటు చేయడంతో పట్టణ ప్రజలు తిలకించడానికి ఉత్సాహంగా తరలివెళ్ళుతున్నారు. భక్తుల రాక పురుష్కరించుకుని మండపం వద్ద సువిశాల స్థలం ఏర్పాటు చేశారు. కాగా దుర్గా భవాని ఉత్సవ కమిటి టీం వర్కును అన్ని వర్గాల ప్రజలు ప్రశంసిస్తున్నారు.

## మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం

**కేశంపేట సెప్టెంబర్ 21 ప్రభాతవార్త..** కేశంపేట మండల పరిధిలోని కొత్తపేట గ్రామానికి చెందిన మాజీ వార్డు సభ్యురాలు నక్క వెంకటమ్మ ఆదివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న గ్రామానికి చెందిన బిజెపి యువ నాయకుడు పాలాది శ్రీనివాస్ వెంకటమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించి అంత్యక్రియల నిమిత్తం ఆర్థిక సహాయంగా 5000 వేల రూపాయలను మృతురాలి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ బిజెపి నాయకులు విటల్ గౌడ్, చల్ల కొండ నరసింహ, నక్క నరసింహులు, తట్టేపల్లి నరసింహ, పుట్నాల శ్రీను, పులి శ్రీకాంత్, నక్క మల్లేష్, నక్క ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

## హెచ్‌సియు విద్యార్థి సంఘ ఎన్నికల్లో ఘనవిజయం



**కేశంపేట సెప్టెంబర్ 21 ప్రభాతవార్త..** హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ హెచ్‌సియు విద్యార్థి సంఘ ఎన్నికల్లో అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఏబీవీపీ ప్యానెల్ ఘనవిజయం సాధించింది. వామపక్ష విద్యార్థి సంఘాల కూటమిని ఓడించి, అన్ని ప్రధాన పదవులను గెలుచుకున్న ఏబీవీపీ విజయం క్యాంపస్ రాజకీయాల్లో కొత్త మలుపు తీసుకొచ్చింది.ఏబీవీపీ ప్యానెల్ నుండి పి. శివ అధ్యక్షుడిగా, దేవేంద్ర ఉపాధ్యక్షుడిగా, శృతి ప్రధాన కార్యదర్శిగా, సౌరభ్ శుక్లా సంయుక్త కార్యదర్శిగా, జ్వాలా ప్రసాద్ క్రీడా కార్యదర్శిగా, వీనస్ సాంస్కృతిక కార్యదర్శిగా, ఐసీసీ జియస్ క్యాష్‌గా సాయి ప్రణతి, రీసెర్చ్ జియస్ క్యాష్‌గా గాయత్రి ఎన్నికయ్యారు.కాంగ్రెస్ అనుబంధ ఎన్ఎస్‌యుఐ ఎన్ ఎస్ యు ఐ నోటా కంటే తక్కువ ఓట్లు రావడం విశేషంగా మారింది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పటికీ ఎన్ ఎస్ యు ఐ బలహీన ప్రదర్శన రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది.గత ఆరేళ్లుగా వామపక్ష, దళిత మరియు ఎన్ ఎస్ యు ఐ యూనియన్ల ఆధిపత్యాన్ని అధిగమించి ఏబీవీపీ కు పెరుగుతున్న మద్దతును ఈ ఫలితాలు సూచిస్తున్నాయని సామాజిక శాస్త్ర విభాగం విద్యార్థి సొప్పరి నరేందర్ అభిప్రాయపడ్డారు. విద్యార్థుల సంకల్పం జాతీయవాదం వైపు మొగ్గు చూపుతూనే విభజన రాజకీయాలకు సవాలు విసురుతోందని ఆయన పేర్కొన్నారు.క్యాంపస్ శాంతి పరిరక్షణ, హెచ్‌సియు భూసంపద రక్షణ, ఉద్యమాల ద్వారా విద్యార్థి సమస్యల పరిష్కారంలో ఏబీవీపీ కృషి విస్తృత మద్దతు తెచ్చుకుందని, ఈ విజయాన్ని హెచ్‌సియు రాజకీయ చరిత్రలో మైలురాయిగా ఆయన విశ్లేషిస్తున్నారు

## ఋణమాఫీ కోసం అర్ధనగ్నప్రదర్శన

**ఘట్‌కేసర్, సెప్టెంబర్ 21, ప్రభాతవార్త:** ఋణమాఫీ పేరుతో రైతులను మోసం చేయాలని చూస్తే కాంగ్రెస్ ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని బిజెపి రాష్ట్రకార్యవర్గసభ్యులు–మాజీ ఎంపిపి ఏనుగు సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఘట్‌కేసర్ సహకార సంఘంలో అర్హు లైన 1,189 మంది రైతులకు ప్రభుత్వం ఋణమాఫీ అమలు చేయాలని తహశీల్దార్ కార్యాలయం మందు ఉమ్మడి ఘట్‌కేసర్ మండల ఋణమాఫీ సాధన సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రైతుల రిలేనిరాహారదీక్షలు ఆదివారంతో 12వ రోజుకు చేరుకుంది. మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు విచ్చేసి దీక్ష చేస్తున్న రైతులకు సంఘీభావం తెలిపారు. ఈసందర్భంగా ఆందోళనను మరింత తీవ్రతరం చేసేందుకు ఋణమాఫీ సాధన సమితి కన్వీనర్ కంట్లం గౌరీశంకర్ ఆధ్వర్యంలో ఘట్‌కేసర్ బస్‌టెర్మినల్ ఆవరణలో రైతులు, నాయకులు బైఠాయించి అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు బిజెపి రాష్ట్ర కార్యవర్గసభ్యులు–మాజీ ఎంపిపి సుదర్శన్‌రెడ్డితో పాటు నాయకులు రైతులు పాల్గొని నిరసన వ్యక్తం చేశారు. కొమ్మిడి మహిపాల్‌రెడ్డి, రేసు లక్ష్మారెడ్డి, బొక్క సురేందర్‌రెడ్డి, ఎర్రోళ్ల మురళీ, వేముల మహేశ్వర్‌గౌడ్, బొక్క కృష్ణారెడ్డి, బొక్క రవీందర్‌రెడ్డి, బొడిగె శ్రీనివాస్‌గౌడ్, భానుప్రకాష్‌రెడ్డి, కొమ్మిడి జైపాల్‌రెడ్డిలు అర్ధనగ్న ప్రదర్శనలో పాల్గొన్నారు.తహశీల్దార్ కార్యాలయం ముందు బొబ్బల నర్సింహ్మారెడ్డి,మ్యాక మల్లయ్యలు కూర్చొగా మాజీ ఎంపిటిసి మేకల నర్సింగ్‌రావు, నాయకులు వచ్చి దీక్ష శిభిరంలో కూర్చొని దీక్ష చేస్తున్న రైతులకు సంఘీభావం తెలిపారు. సాయంత్రం నాయకులు దీక్ష చేస్తున్న వారికి నిమ్మరసం అందజేసి దీక్ష విరమింపజేశారు. సొసైటీలో రైతులకు సకాలంలో ఋణమాఫీ చేయించడంలో విఫలమైన చైర్మన్, డైరక్టర్లు బాధ్యత వహించి రాజీనామా చేయాలని ఆయన కన్వీనర్ గౌరీశంకర్ డిమాండ్ చేశారు. మేడ్చల్ నియోజకవర్గంలో అధికార కాంగ్రెస్‌పార్టీ నేతలు రైతులకు ఋణమాఫీ చేయించడంలో అసమర్థులుగా మిగిలిపోతారని సుదర్శన్‌రెడ్డి విమర్శించారు.

